

- ఐదేళ్ళుగా కొండపై దుకాణాల దందా
- గత బోర్డు ముఖ్యుల పేరిట భారీగా వసూళ్ళు
- విజిలెన్స్ విచారణలో వెల్లడైనా వేటు వేయని ధర్మారెడ్డి
- ప్రభుత్వం మారినా నిక్షేపంగా కొనసాగుతున్న ప్రాబల్యం

తిరుమల రెవిన్యూ విభాగంలో అవినీతి తిమింగలాలు హల్‌చల్ చేస్తున్నాయి. గత ఐదేళ్ళుగా కొండపై దుకాణాల దందాలో వీరి పేర్లు మారుమోగాయి. నాటి పాలకమండలి ముఖ్యుల పేరిట భారీగా వసూళ్ళకు పాల్పడ్డారని, ఆ క్రమంలో టీటీడీ ఆదాయానికి సైతం భారీగా గండి కొట్టారన్న ఆరోపణలున్నాయి. అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గతేడాది ఆఖరులో టీటీడీ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.ఈ విచారణలో రెవిన్యూ విభాగానికి చెందిన పలువురి నిర్వాకాలు వెలుగు చూశాయి. విజిలెన్స్ నివేదికలో టీటీడీ ఆదాయానికి గండి పడడానికి ప్రధాన బాధ్యత వారిదేనని వెల్లడైనా చర్యలు లేకుండానే ఈ ఏడాది ఎన్నికల దాకా మిన్నకుండిపోయింది టీటీడీ. ప్రభుత్వం మారిన తర్వాతైనా ఇలాంటి వారికి కీలక విభాగం నుంచీ ఉద్వాసన పలుకుతారని వేచి చూసిన బాధితులకు నిరాశే మిగులుతోంది. ప్రస్తుత కీలక అధికారుల వద్ద కూడా ఈ వసూల్ రాజాలప్రభ ఏమాత్రం తగ్గలేదని, ఇప్పటికీ దుకాణాల దందా నిక్షేపంగా కొనసాగిస్తున్నారని ప్రక్షాళన కోసం నిరీక్షిస్తున్న వారు వాపోతున్నారు. పాలకపక్ష యువనేత రెడ్‌బుక్‌లో ఈ అధికారి పేరుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రెడ్ బుక్‌లో పేరుంటే ఏమిటట.... కీలక అధికారులు తమకు క్లోజ్ అని, రాబోయే బోర్డు ఛైర్మన్‌కు కాబోయే పీఏలమంటూ కాలరెగరేస్తున్నారని సమాచారం. దీంతో ప్రభుత్వం మారినా ఉపయోగమేమిటంటూ కొండపై టీడీపీ శ్రేణులు సైతం నిట్టూరుస్తున్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి





రెడ్‌బుక్‌లో పేరుంటే ఏమిటట... కొండపై వారిదే రాజ్యం!

తిరుమల రెవిన్యూలో అవినీతి తిమింగలాలు

టీటీడీలో తిరుమల పంచాయతీ అండ్ రెవిన్యూ విభాగం అత్యంత కీలకమైంది. తిరుమలలో నిర్మాణాలకు, మరమ్మతులకు ఈ విభాగమే అనుమతులు ఇవ్వాల్సి వుంటుంది. అలాగే దుకాణాలు, తట్టలుగా పిలిచే హాకర్ల నుంచీ టీటీడీకి అద్దెలు వసూలు చేసే విభాగమిది. తరచూ తనిఖీలు చేస్తూ దుకాణాలు, తట్టల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించకుండా పర్యవేక్షించడం కూడా ఈ విభాగం ప్రధాన బాధ్యత. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ విభాగ అధికారులు, ఉద్యోగులు కొందరు దుకాణాలను, హాకర్లను పర్యవేక్షించే పేరిట అక్రమ దందాలకు తెరలేపారనే ఆరోపణలున్నాయి. అనధికారిక దుకాణాలు, హాకర్ వ్యాపారాలను ప్రోత్సహించారని, టీటీడీకి చేరాల్సిన ఆదాయానికి గండి కొట్టి కొందరు పాలకమండలి ముఖ్యులకు మళ్ళించారనే ఆరోపణలున్నాయి. దాని మాటున తాము కూడా రూ. కోట్లకు పడగలెత్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై గతేడాది టీటీడీకి, ప్రభుత్వానికి విపరీతంగా ఫిర్యాదులు వెళ్ళాయి. ఆ క్రమంలో టీటీడీ గతేడాది జూన్‌లో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దానికనుగుణంగా గత జూన్ 15 నుంచీ 27 వరకూ 13 రోజుల పాటు విజిలెన్స్ సిబ్బంది జీఎన్‌సీ, పీఏసీ 1, 2, 3... ఆర్టీసీ బాలాజీ బస్టాండు, సప్తగిరి, వీజీవో ఆఫీసు ఏరియా, ఎన్‌సీ 1, 2... లేపాక్షి ఎంపోరియం, లేపాక్షి అండర్ బ్రిడ్జి, ఎస్‌ఎన్‌సీ, టీబీసీ, హెచ్‌వీసీ, ఏఎన్‌సీ, ఏటీసీ, పాంచజన్యం, నందకం కేకేసీ, కళ్యాణ వేదిక, శ్రీవారి పాదాలు, మేదరమిట్ట, గుబ్బా సత్రం, శిలాతోరణం, వీఎస్‌జీహెచ్ ఏరియా, ఏబీఎస్, డీఎంబీ రోడ్డు, ఎస్ఎంసీ రోడ్డు, వైకుంఠం-1 క్యూలైన్ ఏరియా, ఎస్‌బీఐ రాగిమాను, ఎస్‌బీఐ ఏటీఎం, అన్నదానం వెలుపలికి వెళ్ళే గేటు, అన్నపూర్ణ క్యాంటీన్, డీఎంబీ, మోకాలిమిట్ట, షాపింగ్ కాంప్లెక్సు, షాపింగ్ కాంప్లెక్సు ఎక్స్ట్రా తట్టలున్న ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

విజిలెన్స్ తనిఖీల్లో దిమ్మదిరిగే అక్రమాలు

మొత్తం 667మంది హాకర్లను తనిఖీ చేస్తే అందులో 165 మంది హాకర్లు టీటీడీకి అద్దె చెల్లించడం లేదని విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. అందులో 86 మందికి టీటీడీ జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలున్నాయి. కానీ వారు అద్దెలు చెల్లించకుండానే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. 13 మంది వద్ద టీటీడీ జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలు కూడా లేవు కానీ ఆశ్చర్యకరంగా వారి వద్ద టీటీడీ హాకర్ ఐడీ కార్డులున్నాయి. వాటిని అడ్డుపెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్నా టీటీడీకి అద్దెలు మాత్రం చెల్లించడం లేదు. 23మంది హాకర్లు దుకాణాల ఎదుట తట్టలు నడుపుతున్నారు. వారు టీటీడీకి అద్దెలు చెల్లించకుండా దుకాణదారులకు అద్దెలు చెల్లిస్తున్నారు. దుకాణాల ముందు వైపు వ్యాపారం చేసుకునేందుకు అనుమతించినందుకు దుకాణాల యజమానులు వీరి నుంచీ రోజువారీ అద్దెలు వసూలు చేసుకుని ఆదాయం పొందుతున్నారు.14 మంది ఇతరుల నుంచీ హాకర్ లైసెన్సులు కొనుగోలు చేసినట్టు స్టాంపు పత్రాలపై అగ్రిమెంట్లు రాసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో టీటీడీకి సమాచారం గానీ, అనుమతులు గానీ లేవు. మరో 29మంది తాము లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నామని, టీటీడీ పరిశీలనలో వున్నాయని చెబుతూ అద్దెలు చెల్లించకుండానే వ్యాపారాలు నడుపుతున్నారు. మొత్తం మీద 165 మంది హాకర్లు టీటీడీ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొండపై అక్రమంగా వ్యాపారాలు నడుపుతున్నట్టు విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు.

ఒక లైసెన్సుతో రెండు మూడు చోట్ల వ్యాపారం

విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో పలువురు హాకర్లు ఒకటికి రెండు చోట్ల వ్యాపారాలు సాగిస్తున్న వైనం వెలుగు చూసింది. ఉదాహరణకు 483, 248, 221, 312, 491, 321, 39, 55, 478, 480, 123-2006, 71, 40, 409, 425, 33 తదితర లైసెన్సు నంబర్లు కలిగిన హాకర్లు ఒక చోట వ్యాపారం నడుపుకునేందుకు లైసెన్సు తీసుకుని రెండేసి చోట్ల వ్యాపారం చేస్తున్నట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. 423వ నంబరు లైసెన్సు కలిగిన హాకర్ అయితే ఏకంగా మూడు చోట్ల వ్యాపారం నడుపుతున్నట్టు గుర్తించారు. ఈ 17 మందిలో ఆరుగురు మాత్రమే తాము లైసెన్సు తీసుకున్న ఒక వ్యాపారానికి గానూ టీటీడీకి అద్దెలు కడుతున్నారు. మిగిలిన వారు అద్దె కూడా ఎగ్గొడుతున్నారు.

విజిలెన్స్ విచారించి దోషిగా తేల్చినా చర్యలేవీ?

రెవిన్యూ విభాగం వైఫల్యం కారణంగానే కొండమీద తట్టల ఏర్పాటు, నిర్వహణల్లో అక్రమాలు జరుగుతున్నాయని విజిలెన్స్ విభాగం నివేదికలో తేల్చినా అవినీతి తిమింగలంపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొందరిని సంబంధిత విభాగం నుంచీ ఇతర విభాగాలకు బదిలీ చేసినా తెర వెనుక కీలక పాత్ర వహిస్తున్న అధికారిని, ఆ అధికారికి సహకరిస్తున్న సిబ్బందిని మాత్రం నిక్షేపంగా కొనసాగిస్తున్నారు. టీటీడీ ముఖ్య అధికారి వద్ద ఈ అవినీతి అధికారే ఇపుడు హల్ చల్ చేస్తుండడం పట్ల టీటీడీ వర్గాలే విస్తుపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకమండలి ముఖ్యులతో, వైసీపీ కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడిన ముఖ్య అధికారితో అంటకాగిన వ్యక్తి ప్రభుత్వం మారాక కూడా అదే స్థానంలో కొనసాగుతూ తన హవా నడుపుతుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. టీటీడీ నుంచే రాష్ట్ర పాలనను ప్రక్షాళన చేస్తామని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు తిరుమలలోనే వ్యాఖ్యానించిన నేపథ్యంలో అవినీతికి పేరుమోసిన అధికారి కీలక విభాగంలో కొనసాగుతుండడాన్ని టీడీపీ వర్గీయులు సైతం ప్రశ్నిస్తున్నారు. గత పాలకమండలి ముఖ్యులకు భారీగా ఆక్రమార్జన రుచి చూపించిన ఈ అధికారి పేరు టీడీపీ యువనేత నారా లోకేశ్ రెడ్ బుక్‌లో కూడా నమోదై వుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తన సామాజికవర్గం కారణంగా బుక్‌లో పేరున్నా తనకేమీ కాదని, కొత్తగా ఏర్పడే పాలకమండలిలో ఛైర్మన్ ఎవరైనా వారికి పీఏగా వ్యవహరించేది తానేనంటూ టీటీడీలో ఇతర అధికారులను కూడా సదరు తిమింగలం హడలగొడుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రక్షాళన తిరుమల పంచాయతీ మరియు రెవిన్యూ విభాగం నుంచే మొదలు పెట్టాలన్న డిమాండ్ పలు వర్గాల నుంచీ వినిపిస్తోంది.

రెవిన్యూ విభాగం వైఫల్యాన్ని నిర్ధారించిన విజిలెన్స్ నివేదిక

హాకర్ల నుంచీ అద్దెలు సక్రమంగా వసూలు చేయడంతో రెవిన్యూ విభాగం విఫలమైందని విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికలో స్పష్టంగా వెల్లడించింది. మరోవైపు అక్రమాలను అరికట్టడంలో విఫలం కావడంతో టీటీడీ ఆదాయానికి గండి పడిందని పేర్కొంది. రెవిన్యూ విభాగంలో ఏఈవోలు భాస్కర నారాయణ చౌదరి, సత్రే నాయక్, సీనియర్ అసిస్టెంట్ మురుగేశన్, జూనియర్ అసిస్టెంట్ యుగంధర్ దీనికి బాధ్యులుగా విజిలెన్స్ విభాగం నివేదికలో నిర్ధారించింది. వీరు సక్రమంగా తనిఖీలు చేయడం లేదని, అద్దెలు వసూలు చేయడం లేదని, అక్రమాలను గుర్తించి చర్యలు తీసుకోలేదని నివేదికలో పేర్కొంది. తిరుమలలో అక్రమ వ్యాపారాలకు సంబంధించి రెవిన్యూ విభాగం ఏఈవో ఒకరు తెర వెనుక కీలక పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొంది. అయితే ఆ అధికారి ఎవరన్నది స్పష్టంగా తెలిసినా, కొండపై వ్యాపారవర్గాల్లో బహిరంగ రహస్యమే అయినా విజిలెన్స్ ఆ అధికారి వివరాలు వెల్లడించడానికి మొహమాటపడినట్టు సమాచారం. అందుకే నివేదికలో.... హాకర్ల వర్గాలలో రెవిన్యూ విభాగానికి సంబంధించిన ఓ ఏఈవో స్థాయి అధికారి "కింగ్‌పిన్"గా వ్యవహరిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది...అని మాత్రమే వ్యాఖ్యానించి వదిలి పెట్టేసింది.

రూ. కోట్లు కొల్లగొడుతున్న తెర వెనుక తిమింగలం

టీటీడీ తిరుమల రెవిన్యూ విభాగంలో పేరుకు ఏఈవో అయినప్పటికీ రూ. కోట్లు కొల్లగొడుతున్నారనే ఆరోపణలున్నాయి. 1990వ దశకం తొలినాళ్ళలో జూనియర్ అసిస్టెంట్‌గా టీటీడీలో ప్రవేశించిన ఆ ఉద్యోగి అంచెలంచెలుగా ఇపుడు ఏఈవో స్థాయికి చేరుకున్నారని, ఆ క్రమంలో అనేక విభాగాల్లో పనిచేసి తీవ్ర అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్నారని కొండ మీద ప్రచారం జరుగుతోంది. గతంలో రెండు సార్లు బోర్డు ఛైర్మన్‌గా పనిచేసిన ఒకరి వద్ద పీఏగా పనిచేసి దర్శనాల టికెట్లు, గదుల కేటాయింపుల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో సైతం వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా వుండగా ఆయన కార్యాలయంలో కొంతకాలం పనిచేశారని, ఆ పలుకుబడి ఉపయోగించి రెవిన్యూ విభాగంలో తిష్ట వేశారని టీటీడీ వర్గాలు చెబుతున్నాయి. గత పాలకమండలిలో ఓ ముఖ్యనేత తనకు అవసరమైన వారికి 30 మందికి అనధికారికంగా తట్టలు పెట్టించాలని హుకుం జారీ చేయగా దాన్ని అడ్డుపెట్టుకుని ఈ అధికారి ఏకంగా 300 దాకా అక్రమ తట్టలు పెట్టించేశారని సమాచారం. ముఖ్యనేత సిఫారసు కలిగిన తట్టల వ్యాపారుల నుంచీ రూ. 20లక్షల వంతున వసూలు చేసి పెట్టారని, అలాగే దుకాణాలు, తట్టలను ఒకచోట నుంచీ మరోచోటికి మార్పించే ప్రక్రియకు సంబంధించి కూడా భారీ మొత్తాలు వసూలు చేసి ముఖ్యనేతకు ముట్టజెప్పారని సమాచారం. తాను సొంతంగా పెట్టించిన అనధికార తట్టల వ్యాపారుల నుంచీ తొలుత భారీ మొత్తాలు రాబట్టుకున్నారని, అనంతరం నెలవారీ అద్దెలు తానే వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అదనంగా ముట్టజెప్పే వారు ఒక లైసెన్సుతో రెండు మూడు చోట్ల వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతిస్తున్నారని సమాచారం. పాలకమండలి కీలక నేత అక్రమార్జన ఒక్కసారికి పరిమితం కాగా ఈ అధికారి అక్రమార్జన దానికి పలు రెట్లు అధికంగా నెలనెలా కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి.

తండళ్ళలోనూ తిమింగలానికే భారీ లబ్ది

తిరుపతి, తిరుమలలో వ్యాపార వర్గాల్లో విస్తృత ప్రచారంలో వుండే వ్యాపారం తండల్. వ్యాపార అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల నుంచీ అప్పుగా తీసుకుని రోజువారీ లేదా వారం వారం కంతులు చెల్లించడమే తండల్. తిరుమల కొండపై హాకర్ లైసెన్సులు కలిగిన వారు, అనధికారికంగా వ్యాపారం చేసుకునే హాకర్లు మొత్తం రెవిన్యూ విభాగంలో పనిచేసే తిమింగలం గుప్పిట్లో చిక్కుకుని వున్నారనే ఆరోపణలున్నాయి. తిరుమల కొండపై తండల్ ఇచ్చే ఓ పేరుమోసిన వడ్డీ వ్యాపారి ఈ అవినీతి అధికారికి సన్నిహితుడు కావడంతో ఈ అధికారి తన డబ్బునే వడ్డీ వ్యాపారి ద్వారా హాకర్లకు అప్పుగా ఇప్పిస్తున్నాడని చెబుతున్నారు. హాకర్లను ఒత్తిడి చేసి వారితో తన స్నేహితుడి వద్ద అప్పు తీసుకునే చేస్తున్నారని, అలా తీసుకోని వారిని తనిఖీలు, జరిమానాల పేరిట వేధించుకుతింటున్నారని సమాచారం. హాకర్లకు ఇచ్చిన రుణాల మొత్తం రూ. 10 కోట్లకు పైబడి వుంటుందని, దానికి రోజువారీ లేదా వారం వారం వసూలు చేసే వడ్డీలు కూడా భారీగానే వుంటున్నాయని సమాచారం. ఈ దందాలో ఎన్నికల ముందు వరకూ పాలకమండలి ముఖ్యనేతకు, అప్పటి కీలక అధికారికి వాటాలు సమర్పించేవారనే ఆరోపణలున్నాయి. మరో అధికారికి తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులో ఏకంగా ఇల్లే కొని బహుమతిగా ఇచ్చారని సంబంధిత విభాగాల్లో ప్రచారం జరుగుతోంది.

'పెద్దిరెడ్డి' గేట్లు తెరుచుకున్నాయ్

కొత్త కమిషనర్ మౌర్య సీరియస్

రోజూ ఉదయం, సాయంత్రం గేట్లు తెరిచివున్నట్టు ఫొటోలు పెట్టాలంటూ ఆదేశం



తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఎట్టకేలకు దిగివచ్చారు. కార్పొరేషన్ వేసిన రోడ్లకు ఆయన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా ఏర్పాటుచేసిన గేట్లను హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆలస్యంగా అయినా తెరిచారు. గురువారం మధ్యాహ్నం గేట్లు తెరుచుకోవడంతో పలువురు రాకపోకలు సాగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక 18వ డివిజన్లోని తన ఇంటికి కార్పొరేషన్ నిధులతో రోడ్లు వేయించుకున్నారు. 'మంత్రిగారి పెరట్లో మునిసిపాలిటీ రోడ్డు' శీర్షికన 2020 సెప్టెంబరు 30న ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారం చేతిలో ఉంది కాబట్టి ఆ రోడ్డును స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యంత్రాంగం ముందుకు రాలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి రోడ్డు బాగోతాన్ని ఆంధ్రజ్యోతి మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేషన్ కమిషనర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ జనసైనికులతో కలిసి పెద్దిరెడ్డి ఇంటిముందు ధర్నాకు దిగిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను నివేదిక కోరడంతో అవి కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్లేనని తేలింది. ఈక్రమంలో పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించారు. పిటీషనర్ల ప్రైవేట్ ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ 10వ తేదీకి కేసును వాయిదా వేశారు.దీనిపై 10వ తేదీ ప్రభుత్వ న్యాయవాది రిట్‌పిటీషన్ దాఖలు చేయగా ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా, గేట్లు మూసివేయకుండా చూడాలని 8వ తేదీ ఇచ్చిన ఉత్తర్వును సవరిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి 4 వారాలకు వాయిదావేసింది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

● హైకోర్టు ఆదేశించినా కార్పొరేషన్ మౌనవ్రతం

హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి తీర్పు వచ్చేవరకు పెద్దిరెడ్డి ఇంటి ముందు రెండు కాలనీలకు దారి కల్పించాలని 10వ తేది కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఈనెల 15న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి. పిటీషనరైన పెద్దిరెడ్డి గేట్లు తెరవని నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలను అమలుచేయాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉంది. అలాంటి చర్యలు ఏమీ తీసుకోకపోవడంతో గురువారం ఆంధ్రజ్యోతిలో హైకోర్టు ఆదేశాలను ప్రచురించింది. దీంతో బాధ్యతలు చేపట్టిన కొత్త కమిషనర్ నారపరెడ్డి మౌర్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గేట్లు తెరిచి, ప్రజల రాకపోకలకు అవకాశం కల్పించాలని, రోజూ ఉదయం, సాయంత్రం గేట్లు తెరిచిన ఫొటోలు తనకు పంపించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. దీంతో పెద్దిరెడ్డి ఇంటి వద్దకు పరుగులు తీసిన సిబ్బంది ఎట్టకేలకు గేట్లను తెరిచారు. దీంతో రాయల్ నగర్- మారుతీనగర్ వాసులకు రోడ్డు అందుబాటులోకి రావడంపై జనసేన నేత కిరణ్ రాయల్ హర్షం వ్యక్తం చేశారు.

కోస్టల్ కారిడార్ భూసర్వే ప్రారంభం



కోట, జూలై 25 : చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూములకు సంబంధించి భూసర్వే గురువారం ప్రారంభమైంది.కోట మండలంలోని కొత్తపట్నం రెవిన్యూ పరిధిలో డిప్యూటీ తహసీల్దారు హరికృష్ణవీఆర్వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వేను ప్రారంభించారు. కోస్టల్ కారిడార్ భూములకు తీసుకునే 444 ఎకరాల్లో సాగవుతున్న పంటలను, ఏ రైతు ఏ మేరకు పంట సాగు చేశారనే వివరాలను ఈ సర్వేలో సేకరించనున్నారు.భూములు కోల్పోయే రైతులకు పరిహారం పంపిణీ చేసేందుకు కొత్తపట్నంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు.భూములన్నీ దాదాపుగా ప్రభుత్వ భూములే అయినప్పటికీ పలువురు సన్నకారు రైతులు జీడిమామిడి, వేరుశనగ పండిస్తున్నారు.ఆయా భూములకు సంబంధించిన పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఆ భూముల లెక్కలు తీయండి

● మూడు నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములు భారీగా అన్యాక్రాంతం ● సమగ్ర నివేదిక ఇవ్వాలన్న సిసోడియా



రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాతో తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25: గడిచిన ఐదేళ్లలో తిరుపతి జిల్లాలో భారీగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని,వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి రికార్డులను తగులబెట్టిన ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.గురువారం సబ్‌కలెక్టరేట్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 60 మండలాల తహసీల్దార్లతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో సిసోడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి, చంద్రగిరి,తిరుపతి నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులందాయని చెప్పారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సిసోడియా ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యంగా తిరుపతి నగరంలో అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించే పేరుతో భారీఎత్తున అక్రమాలు జరిగాయన్నారు. అలా ఎన్ని ఎకరాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి, 22ఏ భూముల విస్తీర్ణం ఎంత, వాటిలో ఎన్ని కన్వర్షను అయ్యాయి, ఇనాం భూముల పరిస్థితిపై క్షుణ్ణంగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. చంద్రగిరిలో చుక్కల భూములు అన్యాక్రాంతం కావడంపై నివేదిక ఇవ్వాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో అప్పటి తహసీల్దార్లు నియోజకవర్గ ప్రజాప్రతినిధికి అప్పనంగా ప్రభుత్వ భూములను కట్టబెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంతో ఇద్దరు తహసీల్దార్లు కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారన్న సమాచారం ఉందని, వారి పరిస్థితిపై కూడా సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. సిసోడియా ఆదేశాల ప్రకారం సమగ్రంగా విచారిస్తే తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పలువురు తహసీల్దార్లు సస్పెండ్ కావడంతో పాటు ముందుండి కథ నడిపించిన వైసీపీ నాయకులు జైలుకు వెళ్లే పరిస్థితి ఖాయమంటూ రెవెన్యూ అధికారుల్లో కలవరం మొదలైంది.

12 కిలోల మారవ చేప



చిత్తూరు జిల్లా సదుంలోని కుమారుని ఒడ్డు చెరువులో గురువారం 12 కిలోల మారవ చేప దొరికింది. ఇక్కడి జాలర్ల వలకు ఈ పెద్ద చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా చూశారు. చెరువులో నీళ్ల మరింత తగ్గితే ఇంకా పెద్ద చేపలు దొరుకుతాయని తెలిపారు. - సదుం

సివిల్ కేసులో జోక్యం

● వీఆర్‌కు భాకరాపేట ఎస్ఐ

భాకరాపేట/తిరుపతి(నేరవిభాగం), జూలై 25: సివిల్ కేసులో జోక్యం చేసుకున్న భాకరాపేట ఎస్ఐ విజయకుమార్‌ను వేకెన్సీ రిజర్వుకు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేసారు.చిన్నగొట్టిగల్లులో ఓ ఇంటిని ఖాళీ చేయించే విషయంలో ఎస్ఐ విజయకుమార్ జోక్యం చేసుకోవడంతో బాధితురాలు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.దీంతో ఆయన విచారణ జరిపించగా ఎస్ఐ జోక్యం చేసుకున్న విషయం నిర్ధారణ కావడంతో క్రమశిక్షణా చర్యల కింద వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు.పోలీసులు ఎవరైనా సివిల్ తగాదాల్లో తలదూర్చితే చర్యలు తీవ్రంగా వుంటాయని ఎస్పీ ఓ ప్రకటనలో హెచ్చరించారు.

ఎంబీయూలో హై-అల్టిట్యూడ్ బెలూన్ శాటిలైట్ ప్రాజెక్ట్ ప్రారంభం

చంద్రగిరి, జూలై 25 : తిరుపతి సమీపంలోని జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల(ఎన్‌ఏఆర్‌ఎల్)తో కలిసి మోహన్ బాబు విశ్వవిద్యాలయం(ఎంబీయూ) హై-అల్టిట్యూడ్ బెలూన్ శాటిలైట్‌ను ప్రారంభించింది. 2023 నవంబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ఎంబీయూ విద్యార్థులకు, అధ్యాపకులకు అంతరిక్ష సాంకేతికత, వాతావరణ శాస్త్రంలో ప్రాక్టికల్ అనుభవం కల్పించడమే కాకుండా, యువతరాన్ని శాస్త్ర, అంతరిక్ష అన్వేషణల పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందని ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు తెలిపారు.ఎన్‌ఏఆర్‌ఎల్ భాగస్వామ్యం ద్వారా, ఎంబీయూ ఈప్రయోగాన్ని కేవలం 1.5 లక్షల రూపాయల వ్యయంతో సాధించగలిగిందని, ఎంబీయూ, ఎన్‌ఏఆర్‌ఎల్ మధ్య ఈ భాగస్వామ్యం భారతదేశ అంతరిక్ష పరిశోధనలో ముఖ్యమైన ముందడుగు వేయిస్తుందని తెలిపారు.

తిరుమల ఘాట్‌లో లారీ బోల్తా

● అర్ధరాత్రి లింక్‌రోడ్డు వద్ద ఘటన ● డ్రైవర్, క్లీనర్లకు స్వల్పగాయాలు



తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో బుధవారం అర్ధరాత్రి ఓ లారీ బోల్తాపడింది. అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం-5 నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. భవన నిర్మాణం కోసం తీసుకువచ్చిన వస్తువులను లోడ్ చేసుకుని ఏపీ 04 టీటీ 1139 నెంబరు గల లారీ బుధవారం రాత్రి జీఎన్సీ వద్దకు చేరుకుంది. తిరుపతికి వెళ్లే ఘాట్‌రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో లోడ్‌తో ఉన్న లారీలను, సాధారణ వాహనాల అనుమతిని నిలిపివేసిన తర్వాత అర్ధరాత్రి నుంచి ఎక్కే ఘాట్‌రోడ్డులో నుంచి కిందకు పంపుతారు. ఈక్రమంలో ఈ లారీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత కిందకు బయలుదేరింది. మార్గంలోని లింక్‌రోడ్డు వద్ద బరువు అధికం కావడంతో లారీ ముందు చక్రాలు విరిగిపోయి బోల్తాపడింది. ఈ ఘటనలో రేణిగుంటకు చెందిన డ్రైవర్‌తో పాటు క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ సమయంలో భక్తుల వాహనాలకు అనుమతి లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ ఆటోక్లినిక్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని లారీను పక్కకు తొలగించి గురువారం వేకువజాము 3 గంటలకల్లా రోడ్డును క్లియర్ చేశారు.

చంద్రబాబు సీఎం అయ్యారని..

● ప్రకాశం నుంచి కాలినడకన వచ్చిన అభిమానులు


కాలినడకన వస్తున్న అభిమానులు

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎం అయ్యారని ఒంగోలు నుంచి తొమ్మిది మంది అభిమానులు కాలినడకన గురువారం తిరుమలకు చేరుకున్నారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో ఉన్న కమ్మవారిపాళెం నుంచి తెలుగు యువత నేత కాట్ల కోటేశ్వరరావు మరికొంత మంది అభిమానులతో కలిసి గతేడాది మే25న కాలినడకన తిరుమలకు వచ్చి చంద్రబాబు సీఎం కావాలని స్వామిని కోరుకున్నారు. బాబు మళ్లీ సీఎం అయితే కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటామని మొక్కుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి భారీ మెజార్టీతో గెలిచి చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు దామా రామారావు, వెంకటేశ్వర్లు, నాగినేని కృష్ణ, దామా స్వామిశేఖర్, శ్రీను, గరికపాటి వెంకటేశ్వర్లు, వెంకటహరి తదితరులు ఈనెల 17వ తేదీన కమ్మవారిపాళెం నుంచి కాలినడకను మొదలుపెట్టి గురువారం తిరుమలకు చేరుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జంప్‌రోప్ పోటీల్లో బీసీఎం విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

మంగళం, జూలై 25: మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ (బీసీఎం)లో ఈనెల 23న నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-12, అండర్-14 బాలబాలికల జంప్ రోప్ పోటీల్లో బీసీఎం విద్యార్థులు ప్రతిభను చాటారు. నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-12లో బాలికలు నలుగురు, బాలురు ఆరుగురు, అండర్-14లో బాలికలు 9మంది, బాలురు ఇద్దరు ఎంపికైన సందర్భంగా గురువారం పాఠశాలలో వీరిని పీఈటీ ప్రమీణ, బీసీఎం పాఠశాల వ్యవస్థాపకులు కృష్ణమూర్తి నాయుడు, కరస్పాండెంట్ ప్రియ, ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళం, జూలై 25: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మురళికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొని స్థానికంగా దోమల బెడద ఎక్కువగా ఉందని, కాలువలను శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు చెన్నరాయప్ప, అజిత్‌బాషా, భూషణం, రాంజీ, పెరుమాళ్, నవీన్, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేద్దాం

బీజేపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ పురుషోత్తం నాయుడు



పాకాల, జూలై 25: చంద్రగిరి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.పురుషోత్తం నాయుడు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ కస్తూరి, మండల బీజేపీ, జనసేన నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. పాకాల పంచాయతీ పరిధిలోని గాంధీనగర్, కరీంతుల్లాబాద్, శ్రీనివాసనగర్, గుట్టకింద ఇండ్లు పరిసర ప్రాంతాలకు బొమ్మయ్యకుంట సమీపం నుంచి తాగునీటి పైపు లైన్ వేయడానికి రైల్వే శాఖ నుంచి అనుమతి మంజూరు చేయించామన్నారు. రైల్వే స్థలంలో పైపులైను వేయాల్సి ఉన్నందున రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లడంతో అనుమతి లభించిందన్నారు. బీజేపీ, తెలుగుదేశం, జనసేన తరఫున రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయడంపై ప్రధాన మంత్రి మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకుడు కె.వెంకటాద్రి నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు గురునాథ్, బీజేపీ మండల ఇన్‌చార్జ్ నరేంద్ర, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు గౌతమి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు సురేష్, మండల ఇన్‌చార్జ్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

ఎర్రావారిపాలెం, జూలై 25: ఉపాధ్యాయ సంఘాల నాయకుల మీద గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసులను పరిశీలించి, ఉపసంహరణ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు శాసనసభలో ప్రకటించడం ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మల్లీశ్వర్, డివిజనల్ కన్వీనర్ మంచినీళ్ల రమణ, ఆర్‌జేయూపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల సిద్ధయ్య హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మేఘాలయ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, మైసూరు సంస్థానం మహారాణి ప్రమోదదేవి, తిరుపతి మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా మైసూర్ సంస్థానం మహారాణి ప్రమోదదేవి పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.


జస్టిస్ వైద్యనాథన్ - ప్రమోదదేవి


అమ్మవారి ఆలయం చుట్టూ హాకర్ల పట్టలు ఎత్తివేస్తున్న విజిలెన్స్ సిబ్బంది - విజిలెన్స్, టీటీడీ అధికారులతో హాకర్ల వాగ్వాదం - చిరువ్యాపారుల దుకాణాలు తొలగించిన దృశ్యం

అమ్మవారి ఆలయం వద్ద చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు

● విజిలెన్స్, హాకర్ల మధ్య వాగ్వాదం ● చివరకు తొలగింపు ● వాహన ప్రదక్షిణకు సహకరించండి ● హాకర్లకు ఆలయ అధికారుల విజ్ఞప్తి

తిరుచానూరు, జూలై 25: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ మహద్వారం నుంచి సూర్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే మార్గం, పుష్కరిణివైపు వెళ్లే మార్గాల్లో ఆలయ ప్రాకారాన్ని ఆనుకుని చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న (పట్టలు) దుకాణాలను టీటీడీ ఎస్టేట్ విభాగం తహసీల్దారు లలితాంజలి, ఏవీఎస్వో సతీష్‌కుమార్, విజిలెన్స్ ఏఎస్ఐ బ్రహ్మానందరాజు కలిసి గురువారం తొలగించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు హాకర్లకు, అధికారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. చాలా సంవత్సరాలుగా అమ్మవారి ఆలయం చుట్టూ పట్టలు కట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్నామని.. పట్టలు ఎత్తివేస్తే ఎలా బతకాలంటూ హాకర్లు ప్రశ్నించారు. సాంప్రదాయం ప్రకారం అమ్మవారి ఊంజల్‌సేవ అనంతరం వాహనసేవ ఆలయం చుట్టూ రావాల్సి ఉందని, అడ్డుగా పట్టలు ఏర్పాటు చేస్తే వాహనం ఎలా వస్తుందంటూ విజిలెన్స్ అధికారులు ప్రశ్నించారు. అమ్మవారి వాహనసేవకు సహకరించాలంటూ ఆలయం ప్రాకారం చుట్టూ ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను తొలగించేశారు. సాయంత్రం అమ్మవారి గజరాజుతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. చిరువ్యాపారులు గేట్ నెంబరు-2 వద్ద వ్యాపారాలు చేసుకోవాలని విజిలెన్స్ అధికారులు సూచించారు. స్థానికులు మాత్రం ఒక్కసారిగా మా ఉపాధిపై దెబ్బకొడితే ఎలా బతకాలంటూ వాపోతున్నారు.

వర్షపు నీటిని చెరువులకు మళ్లించండి

● చంద్రబాబుకు ఎమ్మెల్యే నానీ విజ్ఞప్తి


చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, జూలై 25: చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రావారిపాలెం మండలం శేషాచల అడవుల నుంచి తలకోన ఏటి ద్వారా వృధాగా సముద్రంలో కలుస్తున్న వర్షపు నీటిని సాగునీటి చెరువులకు మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే పులివర్తి నాని విజ్ఞప్తి చేశారు. గురువారం శాసనసభ సమావేశాల సందర్భంగా అమరాతిలో ముఖ్యమంత్రిని నానీ కలిసి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రాధ్యాతలను వివరించారు. తలకోన వర్షపు నీటిని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లోని గొలుసు చెరువులకు మళ్లించడం వల్ల ఆయకట్టు సాగుకు ఉపయోగపడతాయన్నారు. సాగు, తాగు నీటితో పాటు రెండు మండలాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం సానుకూలంగా ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అలరించిన 'భక్త రామదాసు'

తిరుపతి (కల్చరల్), జూలై 25: తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కొత్త ఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీల్లో భాగంగా గురువారం నిర్వహించిన సాంస్కృతిక, నాటక పోటీల్లో జీకే సుందరం ప్రదర్శించిన భక్తరామదాసు ఏకపాత్రాభినయం ప్రేక్షకులను అలరించింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నవజ్యోతి కళానిలయం, జడ్డర్ల వారి మైరావణ పద్యనాటకం ప్రదర్శించారు. రాత్రి ఏడు గంటలకు సిరిమువ్వ కల్చరల్ హైదరాబాదు వారి దారుణం సాంఘిక నాటక ప్రదర్శన జరిగింది.

నేటి కార్యక్రమాలిలా..

శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ విభాగాల్లో నృత్యపోటీలు జరుగుతాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు టీవీజీ కళాక్షేత్రం కర్నూలు వారి శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం ఉంటుంది. రాత్రి ఏడు గంటలకు మహిళా కళా వేదిక సభ జరుగుతుంది. రాత్రి 8 గంటలకు శ్రీచైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటి పువ్వు అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.


భక్త రామదాసు ఏకపాత్రాభినయం - నృత్య ప్రదర్శన - మైరావణ పద్యనాటకం - దారుణం సాంఘిక నాటిక

మానసిక కుంగుబాటే హత్యలకు కారణమా?

● ట్రిపుల్ మర్డర్ కేసులో కొత్త కోణం


మోహన్ (ఫైల్ ఫోటో)

తిరుపతి(నేరవిభాగం), జూలై 25 : తిరుపతిలోని పద్మావతినగర్‌లో బుధవారం సాయంత్రం ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ముగ్గురిని చంపి ఆత్మహత్య చేసుకున్న కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. హంతకుడు మానసికంగా కుంగుబాటుకు గురవడమే ఇందుకు ప్రధాన కారణంగా దర్యాప్తులో పోలీసులు గుర్తించినట్లు సమాచారం. నెల్లూరు జిల్లా సైదాపురం మండలం గంగాదేవిపురానికి చెందిన దాసు వైసీపీలో పని చేస్తూ భార్య సునీత (35), కుమార్తెలు దేవిశ్రీ (13), నీరజ (11)లతో పద్మావతీ నగర్‌లో నివాసముంటున్నారు. ఆయనకు ఇద్దరు తమ్ముళ్లుండగా ఒకరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. మరో తమ్ముడు మోహన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా హైదరాబాదులో పనిచేస్తున్నారు. అతడికి గతంలో వివాహం కాగా తనకు నచ్చని అమ్మాయితో పెళ్లి చేశారని తరచూ అన్నావదినలతో గొడవ పడేవాడు. దీంతో బిడ్డతో కలిసి మోహన్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. రాజకీయంగా పలుకుబడి ఉండి కూడా పెద్దన్న దాసు తన కాపురాన్ని గురించి పట్టించుకోలేదంటూ మోహన్ గొడవ పడేవాడు. తనకు భార్యా బిడ్డ లేకుండా పోగా తన అన్న దాసు మాత్రం భార్యా బిడ్డలతో సంతోషంగా ఉండటం చూసి కక్ష పెంచుకుని తన బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఉన్మాదిలా తయారయ్యాడు. ఇటీవలే హైదరాబాదు నుంచీ తిరుపతి వచ్చిన మోహన్ గొడవ పెట్టుకున్నట్టు చెబుతున్నారు. ఆ నేపథ్యంలోనే బుధవారం రాత్రి 7 గంటల సమయంలో దాసు ఇంట్లో లేని సమయం చూసి అతడి భార్య, ఇద్దరు పిల్లలను కత్తితో నరికి చంపేసి, ఫ్యాన్‌కు ఉరేసుకుని తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. నలుగురి మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం నిర్వహించాక కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు మృతదేహాలను గంగాదేవిపురానికి తరలించినట్లు డీఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తిని ఎస్వీయూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టీడీఆర్ దొంగలను వదలొద్దు

● మున్సిపల్ మంత్రిని కోరిన టీడీపీ కార్పొరేటర్



తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట టీడీఆర్ బాండ్ల రూపంలో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగింది. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి' అని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు, శాలువాతో సత్కరించారు. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లపై నాణ్యత పరీక్షలు చేయాలని, యూడీఎస్ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీనివాసు సేతు పేరును గరుడి వారధిగా మార్చాలని కోరారు. 35వ డివిజన్ నాయకులు శ్రీధర్, జగన్నాథం, 27వ డివిజన్ అధ్యక్షుడు నాగ ప్రతాప్, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'రజక కార్పొరేషన్‌లో అవకాశం కల్పించండి'

రజక కార్పొరేషన్ పాలకమండలి సభ్యుడిగా తనకు అవకాశం కల్పించాలని గురువారం మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్‌తోపాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులను కలిసి టీడీపీ జిల్లా కార్యదర్శి, గంగమ్మ ఆలయ మాజీ సభ్యుడు చెంబుకూరి రాజయ్య కోరారు. మాజీ సీఎం జగన్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం కేసులో గత ఏడాది సెప్టెంబరులో అరెస్టు చేసి తనను 14రోజుల పాటు జైలులో నిర్బంధించారని గుర్తుచేశారు.


సమావేశంలో పాల్గొన్న జీఎస్ఆర్ కృష్ణమూర్తి, తదితరులు

ఎన్ఎస్‌యూలో సి-డాక్ సహకార సమావేశం

తిరుపతిరూరల్, జూలై 25: జాతీయ సంస్కృత వర్సిటీలో బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్(సి-డాక్) పరస్పర సహకార సమావేశం గురువారం కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. పురాతన భారతీయ జ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేయడం, సూపర్ కంప్యూటింగ్ సామర్థ్యాలతో సంప్రదాయ జ్ఞానాన్ని కలపడం, ప్రముఖుల సహకారం, జ్ఞానాన్ని పంచుకునేందుకు ప్రామాణిక వేదికల ప్రాముఖ్యత వంటి అంశాలపై చర్చించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వర్సిటీలో వారం రోజులపాటు సదస్సు, ఓరియెంటేషన్ నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈసదస్సులో ఎన్ఎస్‌యూ, సి-డాక్ మధ్య ఎంవోయూ కుదుర్చుకుంటామన్నారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, నోడల్ అధికారి గణపతిభట్, సి-డాక్ బృంద ఇన్‌చార్జి డాక్టర్ ఎస్‌బీ సుదర్శన్, డాక్టర్ అల్లాడి మోహన్, వేదిక్ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం : ఎస్పీ సుబ్బరాయుడు


సుబ్బరాయుడికి స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్

మంగళం, జూలై 25: శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపనున్నట్లు టాస్‌ఫోర్స్ ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. గురువారం కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులతో సమావేశమై టాస్క్‌ఫోర్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడవుల్లోకి వెళ్లినపుడు ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వ్యవస్థ వినియోగంపై సూచనలు ఇచ్చారు. కడప, రైల్వేకోడూరు, సానిపాయ సబ్ కంట్రోల్స్ నుంచి జరుగుతున్న ఆపరేషన్ విధానాలను టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ వివరించారు. తర్వాత టాస్క్‌ఫోర్సు ఆవరణంలోని కంట్రోల్ రూమ్, పోలీస్‌స్టేషన్, అకౌంట్స్ ఆఫీసు, రవాణా ఆఫీసు తదితర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ(ఆపరేషన్) సురేష్‌కుమార్‌రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

శాస్త్రవిజ్ఞానాన్ని ఆధునికతరాలకు అందించాలి

తిరుపతి రూరల్, జూలై 25: శాస్త్ర విజ్ఞానాన్ని ఆధునికతరాలకు అందించాలని వేదభారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ ఆర్‌వీవీ అవధానులు అన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మహామహోపాధ్యాయ పట్టాభిరామశాస్త్రి వ్యాఖ్యానమాల(సదస్సు) గురువారం రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. మీమాంస న్యాయసూత్రాలు, కంప్యూటర్స్ అనే అంశంపై మాట్లాడారు. బెంగుళూరుకు చెందిన సి-డాక్ బృంద ఇన్‌చార్జి డాక్టర్ ఎస్‌బీ సుదర్శన్ మాట్లాడుతూ టెక్నాలజీ ద్వారా శాస్త్రజ్ఞానాన్ని ఆధునిక తరానికి అందించడం ఎంతో ముఖ్యమన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, కోఆర్డినేటర్, దర్శన విభాగ డీన్ విష్ణుభట్టాచార్యులు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓపీజీ కళ్యాణ్‌శాస్త్రి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలెలా చేస్తారో చూస్తాం!

● టీడీపీ నేతల బెదిరింపులు
● బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కన్నీరు

బాలాయపల్లి, జూలై 25: ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం అంటూ మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైద్యాధికారిపై ఆగ్రహించిన సంఘటన గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కృష్ణవేణిని తొలగించాలని టీడీపీ నేతలు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కృష్ణవేణి పనితీరుపై విచారించి నివేదిక పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా ఎందుకు పంపలేదంటూ టీడీపీ నాయకుడితో పాటు మరి కొందరు గురువారం మధ్యాహ్నం వైద్యాధికారి ప్రమీలను ప్రశ్నించారు.హార్డ్ కాపీ ఇంకా ఎందుకు పంపలేదంటూ ఆమెతో వాగ్వాదానికి దిగి ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం,ఆరోగ్యకేంద్రానికి తాళాలు వేస్తాం, అంటూ బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన వైద్యాధికారి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్ల సమక్షంలో ఆమె మాట్లాడుతూ...రోజువారీ కార్యక్రమాల కారణంగా నివేదిక పంపడం ఆలస్యమైందని చెప్పారు. అయినప్పటికీ పట్టించుకోకుండా అసభ్య పదజాలంతో దూషించారంటూ కన్నీరుమున్నీరయ్యారు.


వైద్య సిబ్బందితో టీడీపీ నాయకులు

పింక్ బస్సు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భాకరాపేట, జూలై 25: తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సోమశేఖరరెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు, దేవ్‌దార్లపల్లె పంచాయతీ తెట్టుపల్లెల్లో గురువారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలకు 47 మంది హాజరు కాగా, 11 మందిని స్విమ్స్‌కు రెఫర్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, కార్యదర్శి మదనమోహన, ఎంపీటీసీ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి మదనమోహనరాజు, నాయకులు బెల్లంకొండ రమణ, మోహన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కుమారస్వామిరెడ్డి, మౌలాలి, మునస్వామి నాయుడు, చోటా సాహెబ్, ఎర్రయ్య నాయుడు, నాగరాజా, శేఖర్‌గౌడ్, శంకర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర


ప్రత్యేక అలంకారంలో పిడచల గంగమ్మ

రామచంద్రాపురం, జూలై 25: మండలంలోని గంగిరెడ్డిపల్లి దళితవాడలో గంగజాతర గురువారం వైభవంగా జరిగింది. బుధవారం రాత్రి ఘటం కుండ మంగళవాయిద్యాల నడుమ ఇంటింటా పూజలందుకుంది. గురువారం వేకువజామున పిడచల గంగమ్మను మట్టితో తయారు చేసి ఆభరణాలతో అలంకరించి, నడివీధిలో కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాల నడుమ అమ్మవారు గ్రామంలో ఊరేగుతుండగా, వేట పొంగళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం గ్రామ బలి కార్యక్రమం ఉత్కంఠభరితగా సాగింది. రాత్రి అమ్మవారిని వాయిద్యాల నడుమ నిమజ్జనం చేశారు.

అలరించిన కీచక వధ

రామచంద్రాపురం, జూలై 25: పరమాల, బుట్టిరెడ్డికండ్రిగ, మోటావారికండ్రిగ మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం భాగవతారణి సుమతి వినిపించి కీచక వధ సభికులను ఆకట్టుకుంది. ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లను ఊరేగించారు. రాత్రి వెంకటేశ్వర నాట్య కళామండలి నిర్వహించిన విరాటపర్వం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆలయధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవలను ఉపయోగించుకోండి

రామచంద్రాపురం, జూలై 25: కుప్పంబాదూరు గ్రామీణ బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని మేనేజరు బి.రాములు కోరారు. గురువారం బ్యాంకు ఆవరణంలో రైతులు, ఖాతాదారుల సమావేశం జరిగింది. మేనేజరు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు 8.60 శాతం, ఇతరులకు 8.25 శాతం వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. రీజనల్ మేనేజరు లక్ష్మీపతి మాట్లాడుతూ కుప్పంబాదూరు శాఖలో ఇప్పటి వరకు రూ.61కోట్లు రుణం ఇచ్చినట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజరు పావని, క్యాషియర్ సుజనారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలతో మంచి ఆరోగ్యం

రామచంద్రాపురం, జూలై 25: ప్రకృతి వ్యవసాయంలో సాగు అయిన పంటలు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయని ఆ శాఖ డీపీఎం పట్టాభిరెడ్డి తెలిపారు. మండలంలోని రాయల మండపం వద్ద గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. పట్టాభిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చీడ, పీడలు లేని పంటలు పండటమే కాక భూమి కూడా సారవంతమవుతుందన్నారు. రైతులు ఏటీఎం ఏ గ్రేడ్ మోడల్స్ సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎంసీలు రంగయ్య, రాధమ్మ, సుజాత, మేఘన పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించండి


మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మంగళం, జూలై 25: రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ జౌళి శాఖ మంత్రి సవిత, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు వినతిపత్రాన్ని అందించారు. గురువారం ఏపీ సచివాలయంలో మంత్రి, ఎమ్మెల్యే చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. త్వరలోనే ఈ సమస్యలకు పరిష్కారం చూపుతామని మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చిన్నరెడ్డిబాబు తెలిపారు.

అమరావతి నిర్మాణానికి ఉపాధ్యాయుడి విరాళం



మంగళం, జూలై 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి మంగళం పరిధిలోని మంగళం ట్రెండ్స్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు డి.కృష్ణమనాయుడు రూ.1,01,116ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీతో కలిసి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అందించారు. గురువారం మంగళం పరిధిలోని టీడీపీ నాయకులతో కలిసి మంత్రి లోకేశ్ చాంబర్‌లో చెక్కును అందజేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, తిరుమలనగర్ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్ఈ గోవిందరాజులు, ఏఎంఎం శ్రీనివాసులు, రామంజేరి నాగేశ్వరరావు, వి.చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పప్పుల ధరలు

● ఇబ్బంది పడుతున్న సామాన్యులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 25: కంది, పెసర, శెనగ, మినపప్పుల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నెల కిందట కిలో కందిపప్పు రూ.140-160 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.190కి చేరింది. సూపర్ మార్కెట్‌లో క్వాలిటీని బట్టి కిలో రూ.200 వరకు విక్రయిస్తున్నారు.కిలో పెసరపప్పు నెల కిందట రూ.100ఉండగా, ప్రస్తుతం రూ.120-130కి చేరింది.మినపప్పు రేటు కూడా కిలో రూ.98 ఎగబాకింది.శెనగపప్పు కిలో రూ.95గా ఉంది.

కందిపప్పు ధర పెరగడానికి కారణమిదే..

కందిపప్పు ధరలు అమాంతంగా పెరగడానికి ప్రధాన కారణం దిగుబడి తగ్గడం, దిగుమతులు లేకపోవడమేనని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో తిరుపతి మార్కెట్‌కు 15 రోజులకు ఒకసారి కర్నూలు, అనంతపురం, పల్నాడు, కాకినాడ, కర్ణాటక ప్రాంతాల నుంచి దాదాపు 50 టన్నుల పప్పు వచ్చేదన్నారు. ప్రస్తుతం 25 టన్నులు కూడా రావడం లేదన్నారు.

'కోడ్' ఉల్లంఘించి నియమించిన ఉద్యోగులను తొలగించండి

ఎస్వీయూ అధికారులకు తెలుగు యువత వినతి


అప్పారావుకు వినతిపత్రమిస్తున్న ఆనంద్‌గౌడ్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఎస్వీయూనివర్సిటీలో నియమించిన 14 మంది ఎన్ఎంఆర్‌లను తొలగించాలని ఉన్నతాధికారులను తెలుగు యువత కోరింది. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టిందన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ కూడా తప్పు పట్టిందని గుర్తుచేశారు. ఇక ఐదేళ్లుగా ఒకే స్థానంలో ఉన్న నాన్ టీచింగ్ ఉద్యోగులందరినీ బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపులకు గురైన వారికి న్యాయం చేయాలన్నారు. నాయకులు రామ్మోహన్, ఆర్కే నాయుడు, రాజు యాదవ్, శ్రీరామ్, రవి, గణేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ టైంస్కేల్ ఉద్యోగ సంఘం కార్యవర్గం


మధుసూదన నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25: ఎస్వీయూనివర్సిటీ టైం స్కేల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఇప్పటివరకు వ్యవహరించిన ఎర్రసాని సుబ్రమణ్యంరెడ్డి వ్యక్తిగత కారణాలతో పదవి నుంచి వైదొలిగారు. దీంతో గురువారం జరిగిన సంఘం సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామరపాటి మధుసూదన నాయుడు, కార్యదర్శిగా కె.గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోమసుందరం, జాయింట్ సెక్రటరీగా రమేష్ నాయుడు, కోశాధికారిగా మురళీకృష్ణారెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్


భవ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భువనేశ్వరి

తిరుపతి(విద్య), జూలై 25: పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని పి.భవ్య.. తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి తెలిపారు. ఎంపీసీ సీనియర్ ఇంటర్ చదువుతున్న భవ్య ఇటీవల బెంగళూరులో జరిగిన సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో పాల్గొన్నారు. 58 కిలోల సీనియర్ విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని, అలాగే ఫోమ్ సి ఇండివిజువల్ విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆమె అభినందించారు. అలాగే భవ్యకు శిక్షణనిచ్చి తీర్చిదిద్దిన పీడీ సాయి సుమతిని ప్రశంసించారు.

దొంగ ఓట్ల కేసు దర్యాప్తును వేగవంతం చేయండి

డిప్యూటీ సీఎంను కోరిన ఆరణి


పవన్‌కల్యాణ్‌కు విన్నవిస్తున్న ఆరణి

తిరుపతి అర్బన్, జూలై 25: దొంగ ఓట్ల కేసు దర్యాప్తును వేగవంతం చేయాలంటూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ఎమ్మెల్యే తన కుమారుడు మదన్‌తో కలిసి పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దొంగ ఓట్ల దర్యాప్తును పట్టించుకోవడం లేదని, టీడీఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని, మాస్టర్ ప్లాన్ రోడ్ల కారణంగా భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా చూడాలన్న అంశాలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణ చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

సీపీఎస్ ఉద్యోగులపై కేసుల ఎత్తివేత నిర్ణయంపై హర్షం

తిరుపతి అర్బన్/ విద్య, జూలై 25: సీపీఎస్ ఉద్యోగులపై గత ప్రభుత్వం నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తి వేయనున్నట్లు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించడంపై సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్లకిరణ్ హర్షం వ్యక్తం చేశారు. ● ఇదే అంశంపై ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ తదితరులు కూడా హర్షం తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 25: రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా కొత్త రవాణా చట్టాన్ని ఆగస్టు ఒకటో తేదీనుంచి పటిష్ఠంగా అమలు చేయనున్నారు. గతంలో రెడ్ లైట్ సిగ్నల్ దాటితే జరిమానా రూ.100గా ఉండేది. దీన్ని ప్రస్తుతం రూ.500కి పెంచారు. మద్యం తాగి వాహనం నడిపితే తొలి విడత రూ.10వేల విధిస్తారు. రెండోసారి కూడా పట్టుబడితే రూ.15వేల జరిమానాతోపాటు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే గతంలో రూ.500 ఉండగా, దీన్ని రూ.5,000గా అపరాధం విధిస్తారు. హెల్మెట్ లేకుంటే ద్విచక్ర వాహనం నడిపితే గతంలో రూ.వంద ఉండగా, రూ.1000గా పెంచారు, మూడు నెలల పాటు లైసెన్సు రద్దు చేస్తారు. ప్రమాదకరంగా వాహనాలు నడిపితే గతంలో రూ.వెయ్యి ఉండగా, దీన్ని రూ.5వేలకు పెంచారు.

కూటమిలోకి వైసీపీ నేతలకు నో ఎంట్రీ

టీడీపీ సమన్వయ కమిటీ తీర్మానం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'ఎన్డీఏ శ్రేణులపై దాడులు, అవినీతి ఆరోపణలు కలిగిన వైసీపీ నేతలను టీడీపీలోకి చేర్చుకోవద్దు. ప్రత్యేకించి కూటమి మిత్ర పక్ష పార్టీల్లోకి కూడా తీసుకోకుండా చూడాలి' అని టీడీపీ నేతలు తీర్మానం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అధ్యక్షతన తిరుపతి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం గురువారం ఆమె నివాసంలో జరిగింది. నామినేటెడ్ పదవులకు ఎన్నికల్లో కష్టపడిన వివిధ కమిటీల నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా సభ్యత్వ నమోదులో అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌ని పూర్తిచేయగలరని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు, నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చినబాబు, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, విజయలక్ష్మి, మన్నెం శ్రీనివాసులు నాయుడు, సురేంద్ర నాయుడు, రాజారామ్, విశ్వనాథం, వేణుగోపాల్ నాయుడు, హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రుయాస్పత్రి సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూలై 25: 'వారాంతపు సెలవు తీసుకోవాలన్నా లేదా అత్యవసర సమయంలో పర్మిషన్ కావాలన్నా ముడుపులు సమర్పించుకోవాలి. లేదంటే వేధింపులకు గురిచేస్తున్నారు' అంటూ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణమ్మపై రుయాస్పత్రిలోని నర్సింగ్ సిబ్బంది కొందరు వారం కిందట కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో దాదాపు 300 మంది వరకు నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రతినెలా వార్డుల్లో డ్యూటీలు వేయడం, సెలవులు, తదితరాలు మంజూరు చేయాలంటే నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 చేయాలి. ఈ క్రమంలో ముడుపులు సమర్పించే కొందరికి కొన్నేళ్లుగా పని తక్కువ ఉండే వార్డుల్లోనే డ్యూటీలు వేస్తూ, ఇవ్వని వారిని ఇబ్బంది పెడుతున్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై గతంలోనూ కలెక్టరుకు ఫిర్యాదు చేస్తే ఆమెకు అనుకూలంగా ఉన్న అధికారులు విచారణ చేయడంతో నామమాత్రంగా మెమో ఇచ్చారన్నారు. ఆ తర్వాత తమపై మరిన్ని వేధింపులు మొదలయ్యాయని తెలిపారు. పైగా ముడుపుల వసూలు కోసం తనకు అనుకూలంగా ఉండే సిబ్బందిలో భువనేశ్వరి, శైలా, మానస దేవి, దుర్గా, శారదాంబ, మంజుల, సుజాతలను నియమించి, వారితో తమపై పెత్తనం సాగిస్తూ వేధింపులకు గురిచేస్తుందని వాపోయారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ రవిప్రభ కూడా ఆమెకు అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయన్నారు. ఈ విషయంలో బయటి అధికారులతో విచారణ చేయించాలని కోరారు.

విచారణ అధికారిగా ఆస్పత్రి అడ్మిన్

కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ విషయంపై స్పందించి విచారణ అధికారిగా గత మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అదితి సింగ్‌ను నియమించారు. ఆమె బదిలీపై వెళ్లడంతో విచారణ వాయిదా పడింది. దీనిపై రుయా సూపరింటెండెంట్ రవిప్రభను కలెక్టర్ వివరణ కోరారు. అలాగే ఆస్పత్రి అడ్మిన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఓ అధికారితో విచారణ చేయిస్తున్నారు. అయితే ఆస్పత్రికి చెందిన అధికారితో విచారణ చేయిస్తే తమ సమస్య పరిష్కారం కావడం అటుంచి, ఇబ్బందులు పెరిగిపోతాయని నర్సింగ్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు మూడ్రోజులే గడువు


మీడియాతో కిరణ్ రాయల్

తిరుపతి అర్బన్, జూలై 25: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదుకు ఇక మూడ్రోజులే సమయం ఉందని తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం జనసేనాని పవన్‌కల్యాణ్ నడుం బిగించారని, దాంతో రూ.500తో సభ్యత్వం తీసుకొన్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల జీవిత బీమాతోపాటు రూ.50వేల వైద్య ఖర్చులకు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత ప్రభుత్వ అధికారి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సుమన్‌రాయల్, మనోజ్, హేమంత్, షరీఫ్, పురుషోత్తం, సాయి, రాజేంద్ర, సిద్దు, సాయిదేవ్, భాను తదితరులు పాల్గొన్నారు.

బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: ఆర్పీఎఫ్

తిరుపతి అర్బన్, జూలై 25: రాష్ట్రవ్యాప్తంగా అధిక జనాభా కలిన బలిజలకు ప్రత్యేక కార్పొరేషన్, రూ.5వేల కోట్లతో నిధిని కేటాయించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్పీఎఫ్) వ్యవస్థాపకుడు రెడ్డిశేఖర్‌రాయల్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. అత్యధికంగా ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని, స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, రిజర్వేషన్ పునరుద్ధరించాలని, తద్వారా రాయలసీమ బలిజలు అభివృద్ధి చెందుతారని స్పష్టం చేశారు. వెంకటరమణ, వేణురాయల్, సాయిప్రకాష్, హరినాథ, రత్నశేఖర్, గోపి, హేమంత్‌రాయల్, జనార్ధన్, సురేంద్రనాథ్, శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ హంస నేతలు

తిరుపతి(వైద్యం), జూలై 25: 'గత ప్రభుత్వం విడుదల చేసిన 143 జీవోతో వైద్యశాఖ అస్తవ్యస్తంగా మారింది. సిబ్బందికి జీతాలు కూడా సక్రమంగా అందడం లేదు. వెంటనే ఈ జీవోను రద్దు చేసి, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి' అంటూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఏపీ హంస నేతలు కోరారు. ఈ మేరకు విజయవాడలోని సచివాలయంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. వైద్య విధాన్ పరిషత్‌లో పనిచేస్తున్న 185 మంది మెటర్నిటీ సహాయకులకు ఐదు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ హాజరు మినహాయించాలని కోరారు. పలు సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్, జిల్లా నేతలు టాటాబాయ్, ఇమ్రాన్, ధర్మలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాల వ్యవస్థాపక దినోత్సవం


ఫ్యాకల్టీ క్లబ్‌ను పునఃప్రారంభిస్తున్న ప్రేమానంద

తిరుపతి(వైద్యం), జూలై 25: ఎస్వీ వైద్య కళాశాల 64వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా 1964 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రేమానంద హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా ఫ్యాకల్టీ క్లబ్‌ను పునఃప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకట్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, వైద్య విభాగాధిపతులు సుబ్బారావు, గోపీకృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

'వైద్యుల నిర్లక్ష్యం లేదు'

తిరుపతి(వైద్యం), జూలై 25: తిరుమలలో పాముకాటుకు గురై రుయాస్పత్రికి తీసుకొచ్చిన రోగిని రక్షించేందుకు అత్యవసర విభాగంలోని వైద్యులు ఎంతగానో కృషి చేశారని సూపరింటెండెంట్ రవిప్రభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంగానే పాముకాటుకు గురైన శ్రీరాములు మృతి చెందాడంటూ బంధువులు చేసిన ఆరోపణలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించారు. ఆస్పత్రికి వచ్చేటప్పటికే రోగి పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని చెప్పారు. మెరుగైన చికిత్స అందించినా, ఆస్పత్రికి రావడం ఆలస్యం అవడంతో శరీరమంతా విషంతో నిండి మృతిచెందాడని, ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 25: జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేసారు. ఎస్పీ ఆదేశాలతో అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీ రవిమనోహరాచారి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు తిరుపతిలోని బస్టాండు, రైల్వేస్టేషన్, ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. జిల్లాలో ప్రముఖ దేవాలయాలు ఉండటంతో యాత్రికుల ముసుగులో నేరగాళ్లు వస్తుంటారని, అటువంటి వారిని గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి ఎస్పీ సుబ్బరాయుడు తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కి పెద్దపీట వేయాలని ఆదేశించారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం


చరణ్‌తేజ - సంకీర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)/ తిరుపతి రూరల్, జూలై 25: ఎస్వీయూ మైక్రోబయాలజీ స్కాలర్ పి.చరణ్ తేజ డాక్టరేట్ పొందారు. మాలిక్యులర్ అనాలసిస్ ఆఫ్ బ్యాక్టీరియల్ డైవర్సిటీ అసోసియేటెడ్ విత్ మాస్కోవైట్-ఎ కామన్ రాక్ ఫార్మింగ్ ఫిలోసిలికేట్ అంశంపై ప్రొఫెసర్ పరమగీతం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు. ● జాతీయ సంస్కృత వర్సిటీలో కంప్యూటర్ శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి కె.సంకీర్తికి డాక్టరేట్ డిగ్రీ(విద్యావారధి)ని ప్రదానం చేసినట్లు సీవోఈ పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ పర్యవేక్షణలో డెవలప్‌మెంట్ ఆఫ్ ఆప్టికల్ క్యారక్టర్ రికగ్నిషన్ సిస్టమ్ ఫర్ సాంస్క్రీట్ అనేఅంశంపై పరిశోధనా వ్యాసం సమర్పించారు.

టీటీడీ అన్నదాన ట్రస్టుకు రూ. 10లక్షల వితరణ

ఘనంగా పీసీరాయలు జన్మదిన వేడుకలు



తిరుపతి అర్బన్, జూలై 25: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పీసీ రాయలు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావుకు రూ.10లక్షల చెక్‌ను అన్నదాన ట్రస్టుకు వితరణ చేస్తూ అందజేశారు. మధ్యాహ్నం గాంధీరోడ్డులోని తన కార్యాలయం ముందు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. అలాగే బైరాగిపట్టెడలోని జాస్మిన్ వృద్ధాశ్రమంలోనూ అన్నదానం చేశారు. ఉదయం కేశవాయనగుంట గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీసీ రాయలును సన్మానించారు. రాత్రి ఓ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టండి

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కి బీజేవైఎం వినతి


రిజిస్ట్రార్‌కి వినతిపత్రమిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25: ఎస్వీ యూనివర్సిటీలో 2019-24 మధ్య సాగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని రిజిస్ట్రార్ మా దాల భూపతి నాయుడిని బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ కల్లూరు విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. ఈమేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకులు, వారి అనుచరులకు ఎలాంటి అర్హత, నోటిఫికేషన్లు లేకుండా ఉద్యోగాలిచ్చారని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జి, తత్సమాన ఉన్నతాధికారి నేతృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు పురుషోత్తం, జయసింహారెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, రంజిత్, మణికంఠ, చెన్నకేశవ పాల్గొన్నారు.

కండలేరు నుంచి నీటి సరఫరా ప్రారంభం


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, తిరుమల వాసులకు అవసరమైన తాగునీటి కోసం కేపీ కెనాల్ ద్వారా కండలేరు నుంచి నీటి సరఫరాను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కండలేరు నుంచి నీటి సరఫరా కొంతకాలంగా జరగడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులకు కార్పొరేషన్ కౌన్సిల్ అనుమతితో రూ.85 లక్షలను ఇటీవలే పూడికతీతకు కేటాయించడం జరిగిందన్నారు. పూడికతీత పనులు చేపట్టి సిద్ధం చేయడంతో నీటి సరఫరాను ప్రారంభించడం జరిగిందన్నారు. నీటిని వృథా చేయొద్దని, కెనాల్ నుంచి రైతులు నీటిని అక్రమంగా మళ్లించవద్దని విజ్ఞప్తి చేశారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్ పాల్గొన్నారు.

గంగమ్మ గుడి చైర్మన్ పదవికి పోటీ

ఇప్పటికే ఇద్దరికి సిఫారసు లేఖలిచ్చిన ఎమ్మెల్యే


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు వినతిపత్రమిస్తున్న తులసీరాం

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కుర్చీ కోసం పోటీ పెరుగుతోంది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇప్పటికే ఇద్దరికి సిఫారసు లేఖలు ఇచ్చినట్టు తెలిసింది. 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో గంగమ్మ ఆలయ చైర్మన్‌గా పనిచేసిన ఆర్సీ మునికృష్ణ మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే సిఫారసు లేఖతో పార్టీ అధిష్ఠానానికి వినతిపత్రం అందజేశారు. అదేబాటలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆముదాల తులసీరాం కూడా చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యే సిఫారసు లేఖ తీసుకుని విజయవాడ బాట పట్టారు. గురువారం టీడీపీ అధినాయకులను కలిసి విన్నవించుకున్నారు. ఇక 26 ఏళ్లుగా చైర్మన్ బలిజలకు చోటు దక్కలేదని, ఈసారైనా తనకు అవకాశం కల్పించాలని లేఖలో కోరారు. ఆముదాల తులసీతోపాటు 36వ డివిజన్ నాయకులు జగదీష్, గిరిబాబు, చంద్రారెడ్డి, సతీష్ వెంట వెళ్లారు. వీరితోపాటు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఎన్నికల ముందు పార్టీలో చేరిన మాజీ చైర్మన్ చింతా భరణి యాదవ్ పేర్లు కూడా వినిపించాయి. పోటీ పెరుగుతున్న నేపథ్యంలో వీరు ప్రత్యామ్నాయ నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నించే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది. నామినేటెడ్ పదవులకు ముందే మున్సిపల్ కౌన్సిల్ కూటమివైపు మారిపోయి, ఆర్సీ మునికృష్ణకు డిప్యూటీ మేయర్ పదవి దక్కితే ఆముదాల తులసీకి గంగమ్మ ఆలయ చైర్మన్ పీఠం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశాభంగం: ఎస్‌యూసీఐ

తిరుపతి(ఆటోనగర్), జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశాభంగమే మిగిలిందని ఎస్‌యూసీఐ (సోషలిస్ట్ యూనిటీ సెంట్రల్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర కార్యదర్శి బీఎస్ అమరనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అంశాలను పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వివిధ ఏజెన్సీల ద్వారా అప్పుల రూపంలో రుణం మంజూరు చేసి, రాష్ట్రానికి తామే సహాయ సహకారాలు అందిస్తున్నామని బీజేపీ ప్రకటనలు చేసుకోవడం తగదన్నారు. రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తదితరాలకు నిధులు ఎందుకు కేటాయించలేదన్నారు.

అడిగోపులకు సాహితీవేత్తల ఘన నివాళి



తిరుపతి (కల్చరల్), జూలై 25: ఎంతో నిబద్ధతతో, నమ్మిన సామ్యవాద సిద్ధాంతం, మానవతా వాదంను నిరంతరం తన రచనలలో ప్రతిఫలించిన గొప్ప కవి అడిగోపుల వెంకటరత్నమని పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. తిరుపతిలో గత శుక్రవారం కన్నుమూసిన అడిగోపుల సంస్మరణ సభ గురువారం స్థానిక యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. తిరుపతికి చెందిన సాహితీ సంఘాల ప్రతినిధులు పలువురు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంకటరత్నంతో తమ అనుబంధాన్ని స్మరించుకున్నారు. సుమారు 50 ఏళ్లకుపైగా సాగిన వారి సాహిత్య యాత్రలో 28 కవితా సంపుటాలను ప్రచురించారన్నారు. ఎక్కడా వివాదాల జోలికి వెళ్లకుండా, తాను నమ్మిన మానవతావాద దృక్పథంతో కవితలు వెలువరించినట్లు తెలిపారు. తొలుత కథకుడిగా, తర్వాత కవిగా తన ప్రయాణం సాగించారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావాల్సిన స్థాయి కవిత్వం రచించినా ఎక్కడా అహం ప్రదర్శించలేదన్నారు. యువ కవులతోకూడా ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారని గుర్తు చేసుకున్నారు. మల్లారపు నాగార్జున ఆధ్వర్యంలో వెంకటరత్నం కుటుంబీకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అభ్యుదయ రచయితల సంఘం తరపున సాకం నాగరాజు, యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమాఖ్య తరపున ఆకుల మల్లేశ్వరరావు, తిరుపతి జిల్లా రచయితల సంఘం, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య తరఫున మన్నవ గంగాధర ప్రసాద్, సాహితీ స్రవంతి తరపున ఓ.వెంకటరమణ, పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ బాబు హాజరై వెంకటరత్నంతో తమ అనుభవాలను పంచుకున్నారు. సభలో భూమన్, జీఎస్ ప్రసాద్, నడ్డి నారాయణ, నెమిలేటి కిట్టన్న, టెంకాయల దామోదరం, అడిగోపుల వెంకట రత్నం భార్య పద్మజ, కుమారుడు శ్రీకాంత్, కుమార్తెలు పాల్గొన్నారు.

నేడు కార్గిల్ డే

తిరుపతి అర్బన్, జూలై 25: ఎన్జీవో కాలనీలోని అమరజవాన్ స్థూపం వద్ద శుక్రవారం ఉదయం కార్గిల్ డే కార్యక్రమం నిర్వహించనున్నారు. తిరుపతి ఈఎంఎస్ అండ్ ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక కమిషనర్ మౌర్య, సైనిక్ ఆఫీసర్ విజయ్‌శంకర్‌రెడ్డి హాజరుకానున్నారు.

మీరు డబ్బు డిపాజిట్ చేయండి.
30 రోజుల్లో రెండింతలు పొందండి.

.. ఇదీ డాయ్ యాప్ పేరిట సాగిన ప్రచారం. ఏజెంట్ల ద్వారా డబ్బులు సేకరించారు. వారి సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. యాప్‌ను ఓపెన్ చేయగానే అందులోని తమ వ్యాలెట్‌లో నగదు కనిపించడం చూసి నమ్మారు. చివరకు సెల్‌ఫోన్లలో ఆ యాప్ కనిపించకపోవడంతో పలమనేరులోని బాధితులు లబోదిబోమంటున్నారు. గతంలో ఇలాంటి మోసాలు సంస్థల తరపున జరగ్గా ఇప్పుడు యాప్‌ను తీసుకొచ్చారు.

- పలమనేరు



ఆశపెట్టి.. మోసగించి

- డిపాజిట్లపై రెండింతలు చెల్లిస్తామంటూ ప్రచారం
- రూ.వంద కోట్లకుపైగా కుచ్చుటోపీ
- పలమనేరులో 'డాయ్ యాప్' కలకలం
- లబోదిబోమంటూ డీఎస్పీ కార్యాలయానికి పరుగుతీసిన బాధితులు

పలమనేరులో గురువారం 'డాయ్ యాప్' మోసం కలకలం సృష్టించింది. ఐదారు నెలలుగా గుట్టు చప్పుడు కాకుండా రూ.వంద కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించిన ఈ యాప్.. ఒక్కసారిగా సెల్‌ఫోన్లలో కనిపించక పోవడంతో వందలాది మంది బాధితులు డీఎస్పీ కార్యాలయానికి చేరుకోవడంతో ఈ మోసం వెలుగు చూసింది. ఈ డాయ్ యాప్‌ను మెప్మాలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ ప్రజల్లోకి తీసుకొచ్చారు. మెప్మాలో పనిచేసే పలువురు ఆర్.పి.ల ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలు, వారి కుటుంబీకులు, బంధువర్గాలను ఇందులోకి లాగారు. డాయ్ యాప్‌లో డిపాజిట్లు కట్టించారు. ప్రతి పది మంది వద్ద డిపాజిట్లు కట్టించేవారికి ఆశాజనకంగా కమీషన్లు అందించారు. నెలసరి జీతాలూ ఉంటాయని నమ్మించారు. దీంతో ఎందరో ఏజెంట్లుగా మారి డబ్బులు కట్టించారు. 30 రోజులకే రెండింతలు వస్తుందన్న ఆశతో జనమూ యాప్ వలలో పడ్డారు. రూ.వేలల్లో నుంచి రూ.ఐదు లక్షల వరకు పలువురు జమ చేశారు. తాము కట్టిన డబ్బులు మూడో రోజుకే ఆయా వ్యక్తులకు జమ చేసినట్లు డాయ్ యాప్‌లోని వారి ఖాతాలో చూపారు. అంటే.. గడువు తీరాక బ్యాంకు ఖాతాలోకి విత్‌డ్రా చేసుకోవచ్చని నిర్వాహకులు చెప్పారట. ప్రతి రోజూ డబ్బులు డాయ్ యాప్‌లో కనిపిస్తుండటంతో ప్రజలు బాగా నమ్మేశారు. ఇందులో తొలుత కట్టిన వారికి కొంతమేర డబ్బులు వచ్చాయి. ఇదంతా ఆ నోట.. ఈ నోట విని మరికొందరూ అప్పుచేసి కట్టారు. 'ఇలా డిపాజిట్లు చేసిన వారిలో పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులూ ఉన్నారు. అందువల్లే మేమంతా దీనిని నమ్మి మోస పోయాం' అని కొందరు బాధితులు వాపోయారు. కాగా, డీఎస్పీ విష్ణురఘువీర్ కార్యాలయం నుంచి వెలుపలకు వచ్చి బాధితుల గోడు విన్నారు. డబ్బు చెల్లించే ముందు ఎవరైనా లిఖిత పూర్వకంగా గ్యారెంటీ ఇచ్చారా అని బాధితులను ప్రశ్నించగా.. అలాంటిది లేదన్నారు. తామంతా మెప్మా రాజేష్, ఆర్పీలు చెప్పిన మాటలు విని డబ్బు చెల్లించామని చెప్పారు. ఒక నెలలో రెట్టింపు డబ్బులు ఎలా చెల్లిస్తారని ఆలోచించకుండా అత్యాశకు పోయారని, ఇకపై ఇలాంటి యాప్‌ల బారిన పడి మోసపోవద్దని హెచ్చరించారు. వివరంగా ఫిర్యాదులు ఇస్తే కేసు దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, తాము మోసపోయిన విషయం బయటకు చెప్పుకోలేని వాళ్లెందరో ఉన్నారు. మొత్తమ్మీద యాప్ పేరిట రూ.వంద కోట్ల మోసం జరిగినట్లు తెలిసింది.



తన కార్యాలయం ముందు గుమికూడిన డాయ్ యాప్ బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రూ.3.5 లక్షలు నష్టపోయా



తొలుత రూ.రెండు లక్షలు కట్టాను. రోజూ కొంత డబ్బు వచ్చేది. ఇలా వచ్చే బోనస్‌కు ఆశపడ్డా. మళ్లీ మరో రూ.లక్ష కట్టాను. మళ్లీ మరో నెంబరు పేరుతో రూ.59 వేలు కట్టాను. ఇలా దాదాపు రూ.3.50 లక్షలు నష్టపోయా.

- లోకేష్‌కుమార్

ఈ నీళ్ల బాటిల్ ఇచ్చారు



మెప్మా రాజేష్ సార్ మీటింగ్ పెట్టి ఆర్.పి.ల ద్వారా అందరి వద్ద డబ్బులు కట్టించారు. తొలుత డబ్బు చెల్లించిన వారికి ప్రోత్సాహకంగా నీళ్ల బాటిళ్లు ఇచ్చారు. దీంతో మేమంతా నమ్మి డబ్బు కట్టాం. ఇకముందు ఎవరూ ఇలాంటి వాటిని నమ్మొద్దు.

- బుజ్జమ్మ

పక్కన వాళ్లను చూసి నేనూ కట్టా



మా ఇంటి పరిసరాల్లోని మహిళలు బంగారు తాకట్టు పెట్టి డబ్బులు కట్టారు. ఉద్యోగులు కూడా డిపాజిట్లు చేయడంతో నేనూ నమ్మి 15వేలు చెల్లించా. భర్తలకు తెలియకుండా వేలాది మహిళలు డబ్బులు కట్టారు. ఈ విషయం ఇంట్లో తెలిస్తే గొడవలవుతాయని బయటకు రాలేదు.

- షామీర్, గంటావూరు



ఎక్కుమందితో డబ్బులు కట్టించిన ఏజెంట్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న మెప్మా రాజేష్ (ఫైల్ ఫొటో)

బాధితుల గోడు

రూ.లక్ష చెల్లించి మోసపోయా



నాకు ఉద్యోగం లేదు. డబ్బుకు ఆశపడి దాదాపు లక్ష రూపాయలు చెల్లించి మోసపోయాను. నేను డబ్బులు సంపాదిస్తున్నానని భావించి నన్నుచూసి చాలామంది డబ్బులు కట్టారు. వాళ్లు మోసపోయారు.

- నవాజ్

అంతా రాజేషే చేశాడు



డాయ్ యాప్‌కు సూత్రధారి మున్సిపాలిటీలో పనిచేసే మెప్మా రాజేష్. మేమంతా మోసపోవడానికి అతడితో పాటు కొంతమంది ఆర్.పిలు కారణం.

- బాబు

నగలు కుదువపెట్టి..



నేను ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నా. గొబ్బిళ్లకోటూరుకు చెందిన నా స్నేహితుడు డబ్బులు కట్టాడు. నెలరోజుల్లో రెట్టింపు డబ్బులు వస్తాయని నేనూ నగలు కుదువపెట్టి రూ.40 వేలు కట్టినా. సెల్‌ఫోన్‌లో యాప్ కనిపించక పోవడంతో మోసపోయానని గుర్తించా.

- రాజన్న



టమోటా ధరలు పతనం

టమోటా ధరలు భారీగా తగ్గు ముఖం పట్టాయి. గురువారం 15 కిలోల బాక్సు కేవలం రూ.300, 250కు చేరింది. నాణ్యత ఉన్న టమోటా 15 కిలోల బాక్సు 250 మాత్రమే పలికింది. మిగిలిన రకాలు రూ.200. వారం కిందట ఒక బాక్సు రూ.700, 800 పలికింది. శనివారం రూ.600కు, సోమవారం రూ.500, బుధవారం రూ.400కు గురువారం రూ.200కు చేరుకుంది. ఇలా రోజు రోజుకు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని టమోటా మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. అనంతపురం జిల్లా, ఇతర రాష్ట్రాల్లో టమోటా దిగుబడులు పెరిగి అక్కడ ధరలు తక్కువగా ఉండడంతో వ్యాపారులు అటు వెళ్లారు. దీంతో జిల్లాలోని మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు తెలిపారు. - సోమల

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఐరాల(కాణిపాకం)/తవణంపల్లె, జూలై 25: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డిలు స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కాగా అంతకుముందు ఆమె తవణంపల్లె మండలం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలికి, స్వామి దర్శనం చేయించారు. శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,24,41,336 లభించింది. గురువారం ఆలయ ఆస్థాన మండపంలో కానుకలను ఈవో వెంకటేశు ఆధ్వర్యంలో లెక్కించారు. ఇందులో 1,256యూఎస్ఎ, 20 ఆస్ట్రేలియా, 4 సింగపూర్, 25 కెనడా డాలర్లు, 6 మలేసియా రింగిట్స్, 15 యూరోలు, 20 యూఏఈ దిర్హామ్స్, 10 ఇంగ్లండ్ పౌండ్లతో పాటు 24 గ్రాముల బంగారు, 440 గ్రాముల వెండి లభించింది. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.9,448, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.30,629 సమకూరినట్లు ఈవో తెలిపారు.

ఉద్యోగాలెలా చేస్తారో చూస్తాం!

- టీడీపీ నేతల బెదిరింపులు
- బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కన్నీరు

బాలాయపల్లి, జూలై 25: ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం అంటూ మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైద్యాధికారిపై ఆగ్రహించిన సంఘటన గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కృష్ణవేణిని తొలగించాలని టీడీపీ నేతలు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కృష్ణవేణి పనితీరుపై విచారించి నివేదిక పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా ఎందుకు పంపలేదంటూ టీడీపీ నాయకుడితో పాటు మరి కొందరు గురువారం మధ్యాహ్నం వైద్యాధికారి ప్రమీలను ప్రశ్నించారు. హార్డ్ కాపీ ఇంకా ఎందుకు పంపలేదంటూ ఆమెతో వాగ్వాదానికి దిగి ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం, ఆరోగ్యకేంద్రానికి తాళాలు వేస్తాం, అంటూ బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన వైద్యాధికారి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్ల సమక్షంలో ఆమె మాట్లాడుతూ... రోజువారీ కార్యక్రమాల కారణంగా నివేదిక పంపడం ఆలస్యమైందని చెప్పారు. అయినప్పటికీ పట్టించుకోకుండా అసభ్య పదజాలంతో దూషించారంటూ కన్నీరుమున్నీరయ్యారు.

కండలేరు నుంచి నీటి సరఫరా ప్రారంభం

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, తిరుమల వాసులకు అవసరమైన తాగునీటి కోసం కేపీ కెనాల్ ద్వారా కండలేరు నుంచి నీటి సరఫరాను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కండలేరు నుంచి నీటి సరఫరా కొంత కాలంగా జరగడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులకు కార్పొరేషన్ కౌన్సిల్ అనుమతితో రూ.85 లక్షలను ఇటీవలే పూడికతీతకు కేటాయించడం జరిగిందన్నారు. పూడికతీత పనులు చేపట్టి సిద్ధం చేయడంతో నీటి సరఫరాను ప్రారంభించడం జరిగిందన్నారు. నీటిని వృథా చేయొద్దని, కెనాల్ నుంచి రైతులు నీటిని అక్రమంగా మళ్లించవద్దని విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

కష్టకాలంలో అండగా నిలిచిన మీ క్షేమమే మా కుటుంబ లక్ష్యం ● శాంతిపురం, రామకుప్పం మండలాల్లో భువనేశ్వరి పర్యటన

కుప్పం/శాంతిపురం/ రామకుప్పం, జూలై 25: రాష్ట్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం, అందుకే ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని నారా భువనేశ్వరి అన్నారు. కష్టకాలంలో చంద్రబాబుకు, టీడీపీకి అండగా నిలిచిన కుప్పం ఒక వరంలాంటిదన్నారు. అందుకనే నియోజకవర్గ ప్రజల క్షేమసమాచారాలు కనుక్కుని, వారికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమం అందించడానికి తాను స్వయంగా వచ్చానని చెప్పారు. మూడో రోజైన గురువారం ఆమె శాంతిపురం మండలంలోని సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లె.. రామకుప్పం మండలంలోని ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమల గ్రామాలలో పర్యటించారు. మహిళలలో ముఖాముఖి సమావేశమయ్యారు. ప్రజల క్షేమ సమాచారం తెలుసుకున్నారు. కుప్పం ప్రజలకు చంద్రబాబు ప్రత్యేక మ్యానిఫెస్టో ఇచ్చారని గుర్తు చేశారు. దానితోపాటు తన పర్యటనలో గమనించిన సమస్యలను ఆయనవద్ద ప్రస్తావించి పరిష్కారాలు చూపుతామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు చంద్రబాబు కష్టకాలంలో ఉన్నప్పుడు రోడ్డుమీదకు వచ్చి ఆందోళనలు చేసి ఆయనకు మద్దతు ప్రకటించడాన్ని తాను మరచిపోలేనన్నారు. వారికి ఆర్థిక స్వావలంబన కలిగించడానికి, వారి కుటుంబాలు బాగుపడడానికి తాను చంద్రబాబు ద్వారా వివిధ పథకాలు అమలు చేయిస్తానన్నారు. కుప్పంలో కార్గో విమానాశ్రయం పూర్తయితే పరిశ్రమలు వస్తాయన్నారు. వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలు తప్పుడు కేసులు బనాయించినా, మెడమీద కత్తిపెట్టినా ఏమాత్రం బెదరకుండా ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు చంద్రబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించారని గుర్తు చేసుకున్నారు. కుప్పం ప్రజల సమస్యలు పరిష్కరించడమే కాకుండా తమకు చేతనైనంతగా సాయం చేస్తానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. తన కుప్పం పర్యటన వెనుక ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాదు ఐటీని చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఆ రంగంలో ఎదిగిన ఐటీ నిపుణులు దేశవిదేశాలనుంచి వచ్చి చంద్రబాబు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయనకు మద్దతుగా నిలబడడం మరువలేని ఘట్టంగా భువనేశ్వరి పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేతలు డాక్టర్ సురేశ్‌బాబు, గాజుల ఖాదర్‌బాషా, గౌనివారి శ్రీనివాసులు, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ నామాలప్ప, యూనిట్ ఇన్‌ఛార్జి నాగభూషణంరెడ్డి, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, మునస్వామి, నరసింహులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురం మండలం బడుగుమాకులపల్లెలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం రెస్కోలో సర్వర్ డౌన్!

మూడు రోజులుగా ఇదే తీరు ● గత ప్రభుత్వ 'అవినీతి' చెరిపేయడానికేనన్న అనుమానం

కుప్పం రెస్కోలో గత ప్రభుత్వ అవినీతి కార్యకలాపాల రికార్డులు చెరిపేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయా? అందుకు సహకార శాఖ.. రెస్కో అధికారులు కలిసి ప్లాన్ చేశారా? ఇప్పటికే జరుగుతున్న విచారణను తప్పుదారి పట్టించడానికి పన్నాగం పన్నారా? రెస్కోలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం ఇస్తున్నాయి.

- కుప్పం



కుప్పం రెస్కోలో మూడు రోజులుగా సర్వర్ డౌన్ అయిందని అధికారులు హడావుడి చేస్తున్నారు. సిస్టమ్స్ ముందు ఉద్యోగులు కూర్చుని ఏవేవో రిపేర్లు చేస్తున్నారు. అప్పుడప్పుడూ బయటి వ్యక్తులూ కార్యాలయంలో కనిపిస్తున్నారు. రెస్కోలో సర్వర్ పనిచేయడంలేదన్న విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం మారినప్పటినుంచీ రెస్కోలో గత పాలకులు, అధికారులు కుమ్మక్కై సాగించిన అవినీతి చర్యలు ఒకటొకటే బయపడుతున్నాయి. 121 మంది ఉద్యోగుల అక్రమ నియామకాల విషయం బహిరంగ చర్చనీయాంశమైంది. ఇక, వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండరు పిలవకుండానే అస్మదీయ కంపెనీల నుంచి అధిక ధరలకు మెటీరియల్ కొనడం.. అక్రమ పదోన్నతులు, వాహనాల నిర్వహణ, డీజీలు ఖర్చులూ తప్పుడు లెక్కలు చూపారు. ఇప్పుడు విచారణ మొదలైంది. సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి విచారణాధికారి హోదాలో ఈనెల 18న రెస్కో కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించి, ఉద్యోగులను విచారించి ప్రాథమిక విచారణ జరిపారు. మళ్లీ వారం తర్వాత వస్తానని చెప్పారు. ఈ క్రమంలో రెస్కో కార్యాలయంలో మూడునాలుగు రోజులుగా నాటకీయంగా సర్వర్ డౌన్ కావడం, సిస్టమ్స్ పనిచేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన సమాచారం చెరిపేసుందుకే అందులో భాగస్వాములైన రెస్కో అధికారులు, కొంతమంది ఉద్యోగులు కలిసి సర్వర్ డౌన్ అనే నాటకం ఆడుతున్నారని ఆ సంస్థ ఉద్యోగులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విచారణకు వచ్చిన శ్రీలక్ష్మికి ఈ రికార్డులు ఇచ్చారో, ఇంకా సిస్టమ్స్‌లో ఎంత సమాచారం నిక్షిప్తమై ఉందో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెస్కో అవినీతిపై మరింత శ్రద్ధపెట్టి, విచారణను వేగవంతం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు తగులబడినట్లు ఇక్కడా సర్వర్ డౌన్ పేరుతో ఎంతమేర సిస్టమ్స్‌నుంచి సమాచారం ఎరేజ్ అయిందో కూడా లెక్క తేల్చాల్సిన అవసరం ఉంది. సర్వర్ డౌన్ కావడంపై రెస్కో ఎండీ సోమశేఖర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మూడు రోజులనుంచి సర్వర్ డౌన్ కావడం వాస్తవమేనని చెప్పారు. ఏదో హార్ట్ డిస్క్ ప్రాబ్లమ్ వల్ల ఇలా జరిగిందన్నారు. అవినీతికి సంబంధించిన సమాచారం ఎరేజ్ చేయడానికి కుట్ర జరుగుతున్నదో లేదో తనకు తెలియదని చెప్పారు.

ఆ 17 మంది విషయంలో ఎందుకలా?

రెస్కోలో 121 అక్రమ నియామకాలకని తెరపైకి వచ్చింది. నిజానికి ఎన్నికలకు ముందుగా నియామకమైన ఉద్యోగులు 104 మంది మాత్రమే. అప్పట్లో వైసీపీ పాలకులతో కలిసి లక్షల ముడుపులు తీసుకుని ఉద్యోగాలిచ్చిన అధికారులే ఇప్పుడూ కొనసాగుతున్నారు. వీరు ఒక కిరికిరి చేశారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఓచర్ వేతనాల చెల్లింపుల ద్వారా నేరుగా ఉద్యోగాలు పొంది, తర్వాత పర్మనెంటు అయి, పదోన్నతులు కూడా పొందిన 17 మందినీ అక్రమ నియామక జాబితాలో చేర్చి ఆ సంఖ్యను 121 చేశారు. ఈ 17 మంది 2014 నుంచి 2016 వరకు టీడీపీ హయాంలో వేతనాలు లేకుండా పనిచేశారు. ఆ తర్వాత వీరికి ప్రభుత్వం వేతనాలు ఇచ్చింది. సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి ఇటీవల విచారణకు వచ్చిన సమయంలో ఈ 17 మంది ఉద్యోగులను ఆ జాబితానుంచి విడదీసి ప్రత్యేక కేసుగా పరిగణించాలని సూచించినట్లు తెలిసింది. అయినా అధికారులు మొండిగా వారిని ఆ జాబితాలోనే ఉంచేసి అందరితోపాటూ వీరికీ నోటీసులు జారీ చేయడానికి చూస్తున్నారు. ఇలా చేయడంవల్ల టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ అక్రమ నియామకాలు జరిగిందని దొడ్డిదారిన నిరూపించడానికి రెస్కో, సహకార శాఖాధికారులు తెగిస్తున్నారు. పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్న జేసీ శ్రీనివాసులు కానీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కానీ ఎందుకో ఈ అంశంపై పట్టీపట్టనట్లు ఊరుకుంటున్నారు.

అడిగోపులకు సాహితీవేత్తల ఘన నివాళి



తిరుపతి (కల్చరల్), జూలై 25: కవిగా ఎంతో నిబద్ధతతో, నమ్మిన సామ్యవాద సిద్ధాంతం, మానవతా వాదంను నిరంతరం తన రచనలలో ప్రతిఫలించిన గొప్ప కవి అడిగోపుల వెంకటరత్నమని పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. తిరుపతిలో గత శుక్రవారం కన్నుమూసిన అడిగోపుల సంస్మరణ సభ గురువారం స్థానిక యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. తిరుపతికి చెందిన సాహితీ సంఘాల ప్రతినిధులు పలువురు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంకటరత్నంతో తమ అనుబంధాన్ని స్మరించుకున్నారు. సుమారు 50 ఏళ్లకుపైగా సాగిన వారి సాహిత్య యాత్రలో 28 కవితా సంపుటాలను ప్రచురించారన్నారు. ఎక్కడా వివాదాల జోలికి వెళ్లకుండా, తాను నమ్మిన మానవతావాద దృక్పథంతో కవితలు వెలువరించినట్లు తెలిపారు. తొలుత కథకుడిగా, తర్వాత కవిగా తన ప్రయాణం సాగించారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావాల్సిన స్థాయి కవిత్వం రచించినా ఎక్కడా అహం ప్రదర్శించలేదన్నారు. యువ కవులతోకూడా ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారని గుర్తు చేసుకున్నారు. మల్లారపు నాగార్జున ఆధ్వర్యంలో వెంకటరత్నం కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అభ్యుదయ రచయితల సంఘం తరపున సాకం నాగరాజు, యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమాఖ్య తరపున ఆకుల మల్లేశ్వరరావు, తిరుపతి జిల్లా రచయితల సంఘం, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య తరపున మన్నవ గంగాధర ప్రసాద్, సాహితీ స్రవంతి తరపున ఒ.వెంకటరమణ, పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ బాబు హాజరై వెంకటరత్నంతో తమ అనుభవాలను పంచుకున్నారు. సభలో భూమన్, జీఎస్ ప్రసాద్, నడ్డి నారాయణ, నెమిలేటి కిట్టన్న, టెంకాయల దామోదరం, అడిగోపుల వెంకట రత్నం భార్య పద్మజ, కుమారుడు శ్రీకాంత్, కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కూటమిలోకి వైసీపీ నేతలకు నో ఎంట్రీ

టీడీపీ సమన్వయ కమిటీ తీర్మానం

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'ఎన్డీఏ శ్రేణులపై దాడులు, అవినీతి ఆరోపణలు కలిగిన వైసీపీ నేతలను టీడీపీలోకి చేర్చుకోవద్దు. ప్రత్యేకించి కూటమి మిత్ర పక్ష పార్టీల్లోకి కూడా తీసుకోకుండా చూడాలి' అని టీడీపీ నేతలు తీర్మానం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అధ్యక్షతన తిరుపతి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం గురువారం ఆమె నివాసంలో జరిగింది. నామినేటెడ్ పదవులకు ఎన్నికల్లో కష్టపడిన వివిధ కమిటీల నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా సభ్యత్వ నమోదులో అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌ని పూర్తిచేయగలరని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు, నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చినబాబు, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, విజయలక్ష్మి, మన్నెం శ్రీనివాసులు నాయుడు, సురేంద్ర నాయుడు, రాజారామ్, విశ్వనాథం, వేణుగోపాల్ నాయుడు, హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీయూలో హై-అల్టిట్యూడ్ బెలూన్ శాటిలైట్ ప్రాజెక్ట్ ప్రారంభం

చంద్రగిరి, జూలై 25 : తిరుపతి సమీపంలోని జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్)తో కలిసి మోహన్ బాబు విశ్వవిద్యాలయం(ఎంబీయూ) హై-అల్టిట్యూడ్ బెలూన్ శాటిలైట్‌ను ప్రారంభించింది. 2023 నవంబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ఎంబీయూ విద్యార్థులకు, అధ్యాపకులకు అంతరిక్ష సాంకేతికత, వాతావరణ శాస్త్రంలో ప్రాక్టికల్ అనుభవం కల్పించడమే కాకుండా, యువతరాన్ని శాస్త్ర, అంతరిక్ష అన్వేషణల పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందని ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు తెలిపారు.ఎన్ఏఆర్ఎల్ భాగస్వామ్యం ద్వారా, ఎంబీయూ ఈప్రయోగాన్ని కేవలం 1.5 లక్షల రూపాయల వ్యయంతో సాధించగలిగిందని, ఎంబీయూ, ఎన్ఏఆర్ఎల్ మధ్య ఈ భాగస్వామ్యం భారతదేశ అంతరిక్ష పరిశోధనలో ముఖ్యమైన ముందడుగు వేయిస్తుందని తెలిపారు.

పెరిగిన పప్పుల ధరలు

ఇబ్బంది పడుతున్న సామాన్యులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 25: కంది, పెసర, శెనగ, మినపప్పుల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నెల కిందట కిలో కందిపప్పు రూ.140-160 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.190కి చేరింది. సూపర్ మార్కెట్‌లో క్వాలిటీని బట్టి కిలో రూ.200 వరకు విక్రయిస్తున్నారు. కిలో పెసరపప్పు నెల కిందట రూ.100 ఉండగా, ప్రస్తుతం రూ.120-130కి చేరింది. మినపప్పు రేటు కూడా కిలో రూ.98 ఎగబాకింది. శెనగపప్పు కిలో రూ.95గా ఉంది.

కందిపప్పు ధర పెరగడానికి కారణమిదే..

కందిపప్పు ధరలు అమాంతంగా పెరగడానికి ప్రధాన కారణం దిగుబడి తగ్గడం, దిగుమతులు లేకపోవడమేనని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో తిరుపతి మార్కెట్‌కు 15 రోజులకు ఒకసారి కర్నూలు, అనంతపురం, పల్నాడు, కాకినాడ, కర్ణాటక ప్రాంతాల నుంచి దాదాపు 50 టన్నుల పప్పు వచ్చేదన్నారు. ప్రస్తుతం 25 టన్నులు కూడా రావడం లేదన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 25: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి దూప,దీప నైవేద్యాలు సమర్పించారు. హారతులిచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సూచిక బోర్డులు

శ్రీకాళహస్తి, జూలై 25: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విశాఖకు చెందిన యాక్ట్ ఫైబర్ నెట్ సంస్థ గురువారం రూ.2లక్షల విలువ గల నాలుగు సూచిక బోర్డులను అందజేసింది. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో జర్మనీ భక్తులు



శ్రీకాళహస్తి, జూలై 25: శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం జర్మనీ దేశస్థులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు స్వామివారి అభిషేక సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. వారు మాట్లాడుతూ శిల్పకళ అద్భుతంగా ఉందన్నారు.

ఏపీసీసీఈ శిక్షణకు సంక్రాంతి రాజేంద్రుడు



శ్రీకాళహస్తి, జూలై 25: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతి సంక్రాంతి రాజేంద్రుడుకి చక్కని అవకాశం లభించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో సింగిల్ మేజర్ స్ట్రీమ్ ప్యాట్రన్ విధానంలో సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఇందుకు సంబంధించి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఏపీసీసీఈ శిక్షణ ఇవ్వనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి రాజేంద్రుడికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఈయనను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు వర్మ, బాపనయ్య, పరంధామయ్య తదితరులు గురువారంఅభినందించారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, జూలై 25: స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత హాజరై సుమారు 250మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతివారం పేదలకు అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వీర మహిళలు శారద, గాయత్రి, నిర్మల, లక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగు తరలింపునకు చర్యలు

వరదయ్యపాళెం, జూలై 25: తొండంబట్టు మధ్యలో మురుగునీటి నిల్వ తరలించేందుకు అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. ఈ నెల 14న మురుగు పారే దారేది? అన్న శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు గురువారం జేసీబీతో అక్కడికి చేరుకుని మురుగును తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

పౌష్టికాహారంతో పాటు విద్యాబోధన

కేవీబీపురం, జూలై 25: పౌష్టికాహారంతో పాటు పిల్లలకు చదువు నేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి సూచించారు. గురువారం కర్లపూడి, కోవనూరు, పీవీకండ్రిగ గిరిజనకాలనీల్లోని అంగన్‌వాడీలను ఆమె తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు ఏ మాత్రం అక్షరాలు వస్తున్నాయో పరీక్షించారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు తయారు చేసి వడ్డించాలన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



శ్రీకాళహస్తి, జూలై 25: రామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 36మంది విద్యార్థులకు ఏర్పేడు మండలం మర్రిమంద హరిజనవాడకు చెందిన కల్లూరు రంగయ్య గురువారం విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పైపూరి మల్లిఖార్జున రావు, ఉపాధ్యాయులు సాధు గిరి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ : డీఎస్పీ



ర్యాలీలో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులు


శ్రీకాళహస్తి, జూలై 25: హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ద్విచక్ర వాహనదారులకు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని నినదిస్తూ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ లోకేష్‌బాబు, సహాయ కమిషనర్ పార్వతి, యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు గోపాలకృష్ణ, వెంకటరమణ, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి నగదు బహూకరణ



పిచ్చాటూరు, జూలై 25: వెంగళత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని బి.జ్యోత్స్నకు బంగారుపాళెం రిటైర్డ్ ఎంఈవో వరలక్ష్మి దంపతులు రూ.10 వేలు బహూకరించారు. గురువారం జడ్పీ హైస్కూల్‌లో ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వరలక్ష్మి మాట్లాడుతూ ఏటా ఈ హైస్కూలులో ప్రతిభావంతులకుబహుమతులు అందజేస్తామన్నారు. ఎంఈవో యుగంధర్ రాజు వీరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులపై సీఎంను కలిసిన సుధీర్



శ్రీకాళహస్తి, జూలై 25: నియోజకవర్గ అభివృద్ధి ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. గురువారం అసెంబ్లీ సమావేశం ముగిశాక ఆయన్ను క్యాంపు ఆఫీస్‌లో కలిశారు. తాను చేసిన ప్రతిపాదనలపై. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తిరుమల ఘాట్‌లో లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్లకు స్వల్పగాయాలు

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో బుధవారం అర్ధరాత్రి ఓ లారీ బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం-5 నిర్మాణ సామగ్రితో లారీ బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత కిందకు బయలుదేరింది. మార్గంలోని లింక్‌రోడ్డు వద్ద బరువు అధికం కావడంతో లారీ ముందు చక్రాలు విరిగిపోయి బోల్తాపడింది. ఈ ఘటనలో రేణిగుంటకు చెందిన డ్రైవర్‌తో పాటు క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ సమయంలో భక్తుల వాహనాలకు అనుమతి లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్, ఆటోక్లినిక్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని లారీను పక్కకు తొలగించి గురువారం వేకువజాము 3 గంటలకల్లా రోడ్డును క్లియర్ చేశారు.

కుమారస్వామి వేడుకకు ధ్వజారోహణ



శ్రీకాళహస్తి, జూలై 25: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయ సన్నిధివద్ద గురువారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని మొదట కలశస్థాపన పూజలుచేశారు. అభిషేక, హోమ పూజలను జరిపారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో అరటి ఆకులో ధ్వజస్తంభాన్ని తీర్చిదిద్ది ధ్వజారోహణను వేదోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, వేదపండితులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్సవాలు

కుమారస్వామి రెండవ తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి భూత వాహనంపై ఊరేగనున్నారు.

అంతిమ యాత్రకూ దారి కష్టాలే..



ఏర్పేడు, జూలై 25: పెనుమల్లం దళితవాడ స్మశాన వాటికకు దారి లేక అవస్థలు పడుతున్నారు. గురువారం దళితవాడకు చెందిన సరోజనమ్మ(80) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ వృద్ధురాలు మృతదేహాన్ని దారి లేక పంట పొలాల మీదుగా స్మశానవాటికకు తీసుకెళ్లారు. దళితవాడ ఏర్పడినప్పటి నుంచి దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చెస్తున్నారు. 50 కుటుంబాలున్న తమ దళితవాడ స్మశానవాటికకు దారి కల్పించాలని వారు కోరుతున్నారు.

సర్పంచ్ చొరవతో స్మశానానికి స్థలం కేటాయింపు



స్థలంలో సర్పంచ్ రోసిరెడ్డి, గ్రామస్థులు

పిచ్చాటూరు, జూలై 25: సర్పంచ్ రోసిరెడ్డి చొరవతో స్థానిక టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ స్మశాన వాటికలకు అధికారులు స్థలం కేటాయించారు. గతంలో ఉన్న శ్మశాన వాటిక భూములను టూరిజం అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ తీసుకుంది. ఈ క్రమంలో ఇరిగేషన్ ఈఈ మదన్ గోపాల్‌తో సర్పంచ్ రోసిరెడ్డి చర్చించారు. అరణియార్‌లోనే మరో చోట స్థలం చూపినట్లు సర్పంచ్ తెలిపారు. ఈస్థలాన్ని చదును చేయించారు. అధికారులకు, సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

సత్యవేడు, జూలై 25: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఉషాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ పాసైన విదార్థులు కోర్సుల్లో నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. చేరదలచుకున్న వారు టెన్త్ ఒరిజినల్ మార్క్‌లిస్ట్, టీసీ, ఆధార్ కార్డు, ఆరు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని ఉదయం 9 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. అడ్మిషన్ ఫీజు కింద విద్యార్థులు రూ.6500 చెల్లించాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ స్పష్టంచేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సిద్ధ ఔషధ నేత్ర చికిత్సకు విశేష స్పందన



వరదయ్యపాళెం, జూలై 25: బత్తలవల్లం ఏకం ఆలయ ప్రాంగణంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కల్కిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 250మంది పాల్గొని వైద్యసేవలు పొందారు. ఈ సందర్భంగా లోకేష్ దాసాజీ మాట్లాడుతూసిద్ధులు సాంప్రదాయబద్ధంగా ఉపయోగించే అరుదైన మూలికల సారాలను కళ్లలో పూయడం వలన పలు వ్యాధులు నయమవుతాయన్నారు. కార్యక్రమంలో సతీష్ పాల్గొన్నారు.

వేతనాన్ని ఆపేశారని హెచ్‌ఎంపై టీచర్ల నిరసన

సత్యవేడు, జూలై 25: దాసుకుప్పం జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం జ్యోతి తీరుపై పాఠశాల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండుసార్లు బదిలీ అయి వెంటనే వెనక్కు రాగలిగిన ఆమె కక్షపూరితంగా ఫిబ్రవరిలో తమ వేతన బిల్లును ఖాతాకు జమచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గురువారం మీడియా వద్ద వారు ఆవేదన వ్యక్తంచేశారు. కాగా ఉపాధ్యాయులు కావాలని ఆరోపణలు చేస్తున్నారని జ్యోతి పేర్కొన్నారు.

చెంగల్వరాయస్వామి పురవిహారం



శ్రీకాళహస్తి, జూలై 25: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వద్ద గురువారం ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. రాత్రి మేళతాళాలు,మంగళవాయిద్యాల నడుమ స్వామిని చప్పరంపై అధిష్ఠించి ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో ఇరుకు రోడ్డు విస్తరణ



వరదయ్యపాళెం, జూలై 25: సీఎల్‌ఎన్‌పల్లి పంచాయతీకి చెందిన చావాలి హరిజనవాడ, అరికిచేలు గ్రామానికి వెళ్లే రహదారి గత 20 సంవత్సరాలుగా ఇరుగ్గా ఉండేది. కేవలం ఒక వాహనం వెళ్లడానికి మాత్రమే అవకాశం ఉండేది. చాలాకాలంగా ఈ రోడ్డుకు మోక్షం లభించలేదు. ఈ ఇరుకు రోడ్డు మార్గంలో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈనేపథ్యంలో సీఎల్‌ఎన్‌పల్లి సర్పంచ్ దుడ్డు వేణు ఆధ్వర్యంలో గ్రామస్థులు, రైతుల సమావేశం నిర్వహించారు. ఇరుకు మార్గాన్ని వెడల్పు చేసేందుకు కొంతభాగాన్ని రైతులు స్వచ్ఛందంగా ఇవ్వాలని కోరారు. దీనికి రైతులు అంగీకరించారు. గురువారం ఈ మార్గాన్ని వెడల్పు చేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవ చూపి సీసీరోడ్డు మంజూరు చేయాలని గ్రామస్థులు, రైతులు, సర్పంచ్ కోరుతున్నారు. సర్పంచ్ చొరవను గ్రామస్థులు అభినందించారు.

శిక్షా సప్తాహ్ క్రీడల ప్రారంభం



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 25: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని రెండవ ఎంఈవో మునిసుబ్రమణ్యం అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ క్రీడలను గురువారం ఎంఈవో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. పీడీ మస్తాన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడిపై దాడి

శ్రీకాళహస్తి, జూలై 25: పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడిపై మరొకరు స్క్రూడ్రైవర్‌తో దాడి చేసిన వైనమిది. పట్టణానికి చెందిన ఇద్దరి యువకుల మధ్య ఇటీవల విబేధాలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి 1-టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట వారిద్దరూ వాదోపవాదాలకు దిగారు. ఈ క్రమంలో కారుడ్రైవర్‌గా పనిచేసే యువకుడిపై మరొకరు స్క్రూడ్రైవర్‌తో దాడి చేశాడు. స్వల్పంగా గాయపడిన కారుడ్రైవర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. పోలీస్‌స్టేషన్ ఎదుటే గొడవ పడుతున్నా ఎవరూ స్పందించలేదు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా ప్రభుత్వాస్పత్రిలో చేరమంటూ వారు సలహా ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ప్రత్యేక ఆధార్ కేంద్రం పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 25: కాటూరు సచివాలయ పరిధిలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్‌ను తీసుకోవాలన్నారు. ఆధార్‌లో మార్పులు,చేర్పులు చేసుకోవచ్చునన్నారు.

పుత్తూరు వార్తలు

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



వడమాలపేట, జూలై 25: గుర్తు తెలియని వృద్ధుడు అంజేరమ్మ కనుమ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ధర్మారెడ్డి కథనం మేరకు 60-65 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. చామనచాయ రంగు కలిగి, గళ్ల నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లేవు..మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

మహిళలతోనే పురోగతి

పుత్తూరు టౌన్, జూలై 25: మహిళలతోనే ఆర్థిక పురోగతి సాధ్యమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత పేర్కొన్నారు. గురువారం రాష్ట్రీయ సేవా సమితి కార్యాలయంలో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, శోభారాణి, ప్రకాష్, శేఖర్, దివాకర్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

స్మశాన స్థలాన్ని కాపాడాలని యానాదుల ధర్నా

పుత్తూరు టౌన్, జూలై 25: మజ్జిగ గుంట స్మశాన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని దళిత సంఘ నాయకులు గ్రామస్థులు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యానాదుల నాయకుడు నందయ్య మాట్లాడుతూ 2019లో యానాదులకు స్మశానానికి కేటాయించిన 50 సెంట్ల స్థలంపై కొంతమంది కబ్జాదారులు కన్నుపడిందన్నారు. బుధవారం ఆ స్థలంలో జేసీబీలతో చదును చేసుకుని ఆక్రమణకు పాల్పడుతున్నారని వీఆర్వో సురేష్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. .

అన్న క్యాంటీన్‌కు స్థలం ఖరారు



క్యాంటీన్ ఏర్పాటుకు పనుల ప్రారంభం

పుత్తూరు అర్బన్, జూలై 25:. పట్టణ నడిబొడ్డున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటుకు మున్సిపాలిటీ స్థలాన్ని ఖరారు చేసింది. గురువారం ముందస్తు పనులను ప్రారంభించారు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నం నాయుడు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ వాసులు అందరికీ సౌలభ్యంగా ఉన్న స్థలంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాల మేరకు పనులను ప్రారంభించినట్లు చెప్పారు. రూ.62.14 లక్షలతో క్యాంటీన్‌ను నిర్మిస్తున్నారన్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, చెంగమనాయుడు బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంద్, బీఆర్ మురళీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్ష్మీపతి, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో రోడ్డు మరమ్మతులు



వడమాలపేట, జూలై 25: లక్ష్మీపురం రోడ్డుకు ఉపాధి హామీ నిధులతో మరమ్మతులు చేపట్టారు. మెయిన్‌రోడ్డు నుంచి లక్ష్మీపురం రోడ్డులో ఇరువైపులా ముళ్లపొదలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. నడిచి వెళ్లడానికి గ్రామస్థులు భయపడేవారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి మాజీ ఎంపీడీసీ సభ్యులు దనంజయుల నాయుడు చొరవతో ఉపాధి పనుల్లో భాగంగా ముళ్లపొదలు తొలగించారు. ఆయన సొంత నిధులతో మట్టి తోలించి శుభ్రం చేయించారు.